www.flashindianews.com

FLASH INDIA NEWS
ప్రతిక్షణం.. ప్రజలకోసం...

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

| సంపుటి : 17 | సంచిక : 216 | బుధవారం 07.10.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/- |
|---|---|---|---|---|---|



విలేకరులు కావలెను

18 సం|| లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల, మండలాల వారీగా విలేకరులు కావలెను..

★ ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించవలసిన నంబర్ ★

సెల్ నెంబర్: 9951494039


# 24 గంటలూ నిరంతర విద్యుత్ సరఫరా

## నీటిని పొదుపుగా వాడాలి



**8 వేల మెగావాట్ల అదనపు భారం.. అయినా సరఫరా**

**నీటి కొరతపై భట్టి కీలక హెచ్చరిక**

పవర్ సరఫరాలో అంతరాయం లేదు: డిప్యూటీ సీఎం

**పెరిగిన డిమాండ్.. అయినా కరెంట్ కోతలు లేవు**

- కరెంట్ డిమాండ్ పెరిగినా సరఫరాలో కోత లేదు
- విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు చేరిక
- జలవిద్యుత్ తగ్గినా పవర్ సరఫరా నిరంతరం
- ఎల్‌నినోతో జలవిద్యుత్ ఉత్పత్తికి దెబ్బ
- పవర్ డిమాండ్‌పై భట్టి కీలక ప్రకటన
- విద్యుత్ సరఫరాపై ప్రజలు ఆందోళన చెందొద్దు
- పీక్ డిమాండ్‌లో తెలంగాణకు కొత్త రికార్డు
- థర్మల్ విద్యుత్‌తో డిమాండ్‌కు చెక్
- నీటి కొరతపై భట్టి కీలక హెచ్చరిక
- విద్యుత్ సవాళ్లను అధిగమిస్తున్నాం: భట్టి
- జలవిద్యుత్ తగ్గినా.. 24 గంటల పవర్
- పెరిగిన పవర్ డిమాండ్.. ప్రభుత్వానికి సవాల్
- నీటి లభ్యత తగ్గడంతో జలవిద్యుత్‌కు బ్రేక్
- పవర్ సరఫరాలో అంతరాయం లేదు: డిప్యూటీ సీఎం

05



## గాజులరామారం ఇందిరమ్మ టవర్స్

**నినాదాలతో వేడెక్కిన ఇందిరమ్మ ఇళ్ల సభ**

ఇందిరమ్మ ఇళ్ల భూమిపూజలో ఆసక్తికర పరిణామాలు
స్టేజ్‌పై మాజీ ఎమ్మెల్యేకు దక్కని చోటు
భూమిపూజలో మహిళలతో ఇటుక పెట్టించిన మంత్రి
కుత్బుల్లాపూర్‌లో పోటాపోటీ నినాదాలు
మాజీ ఎమ్మెల్యేను స్టేజ్‌పైకి పిలిచిన నిర్వాహకులు

03

## తాగేవారికే కొంత భారం

### ప్రివిలేజ్ ఫీ వల్ల బార్‌లకు నష్టం లేదు..



**కేసీఆర్‌ను అడగమని కేటీఆర్ చెబితే నేను అడగలేదు**

శ్రీశైలం నీటిని పూర్తిగా వాడుకుంటాం

స్వాభిమానం కోసమే బీఆర్‌ఎస్‌ను వీడా: జూపల్లి

- ప్రివిలేజ్ ట్యాక్స్‌పై మంత్రి జూపల్లి క్లారిటీ
- బార్లకు నష్టం లేదు.. భారం మందుబాబులపైనే
- మద్యం ధరల పెంపుపై మంత్రి ఆసక్తికర వ్యాఖ్యలు
- నీటి వినియోగంపై సీఎం రేవంత్‌తో చర్చలు

02



## ఇక చాలు బ్రో, రాజీనామా చెయ్

**'ఎస్ఐఆర్'పై మండిపడ్డ ఎంపీ చామల**

జ్ఞానేశ్ రాజీనామా చేయాల్సిందే : విపక్షాలు

- జ్ఞానేశ్ రాజీనామాకు విపక్షాల డిమాండ్
- ఎస్ఐఆర్ పై విపక్షాల పోరు.. ఢిల్లీలో ఉద్రిక్తత
- ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా విపక్షాల నిరసన
- ఎస్ఐఆర్ నిలిపివేయాలంటూ ఎంపీల ఆందోళన
- ఈసీ కార్యాలయం వైపు విపక్షాల పాదయాత్ర
- బారికేడ్లు దాటలేక రోడ్డుపైనే ఎంపీల ధర్నా
- ఢిల్లీలో విపక్షాల నిరసన.. భారీగా పోలీసులు
- ఎన్నికల సంఘంపై విపక్షాల తీవ్ర ఆగ్రహం

05

## ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల రద్దు..




కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లకు బ్రేక్
రూ.1,090 కోట్ల ప్రాజెక్ట్‌పై ప్రభుత్వం కీలక నిర్ణయం
పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట
ట్రాఫిక్ సమస్యకు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి

03

పంజాగుట్ట-జూబ్లీహిల్స్ ఎలివేటెడ్ కారిడార్‌కు సన్నాహాలు


SIR Special Intensive Revision

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ప్రత్యేక సమగ్ర సవరణ)

జూన్ 25, 2026 నుండి

భారత ఎన్నికల సంఘం

17.08.2026న ప్రచురించబడిన ముసాయిదా ఓటర్ల జాబితాలో మీ వివరాలను పరిశీలించుకోండి

సందేహాలకు మీ బూత్ లెవెల్ ఆఫీసర్ (BLO)/ AERO/ERO ని సంప్రదించండి.

ఓటు

V.O.T.E

క్లెయిమ్‌లు & అభ్యంతరాలు స్వీకరణ దశ

07-10-2026 వరకే

త్వరపడండి నేడే ఆఖరి రోజు




- ఫారం-6 : నూతన ఓటర్‌గా నమోదుకు
- ఫారం-7 : తొలగింపులకు
- ఫారం-8 : సవరణలకు, చిరునామా మార్పుకు

తుది ఓటర్ల జాబితా ప్రచురణ: 09-11-2026

Scan here for ecinet.eci.gov.in

Website: https://voters.eci.gov.in / https://ecinet.eci.gov.in / https://www.eci.gov.in

వివరాలకు: బూత్ లెవల్ ఆఫీసర్‌ను సంప్రదించండి (BLO)/AERO/ERO

CEOTelangana CEOTelangana ChiefElectoralOfficerTelangana CEO_Telangana

వివరాలకు, టోల్‌ఫ్రీ 1950 ఉ|| 10:30 - సా||5:00 వరకు

మీ ఓటు.. మీ బాధ్యత.

ఓటర్ల జాబితాలో మీ వివరాలను అప్‌డేట్ చేసుకోండి-పటిష్టమైన ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి


## సిరిసిల్లకు సీఎం ఏం ఇచ్చారు?

- ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తాం: కవిత
- రాజన్న చెరువు ప్రక్షాళనకు నిధులు ఇవ్వాలి
- వేములవాడలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై ఆగ్రహం
- కాళేశ్వరం నీళ్లు రైతులకు అందించాలి: కవిత
- కాళేశ్వరం నీళ్లపై కవిత సంచలన వ్యాఖ్యలు
- రైతులకు నీళ్లు, కరెంట్ ఇవ్వాలి: కవిత
- వేములవాడలో అభివృద్ధి ఎక్కడ?: కవిత

03






## రైతులకు కోతలు.. ప్రజలకు వాతలు

విద్యుత్ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారు

కరెంట్ సంక్షోభానికి కాంగ్రెస్‌దే బాధ్యత

- రూ.5,420 కోట్ల విద్యుత్ భారంపై హరీశ్ ఫైర్
- ట్రూ-అప్ ఛార్జీలను వెంటనే రద్దు చేయాలి
- కరెంట్ కోతలు.. బిల్లులతో ప్రజలపై భారం
- కాంగ్రెస్ పాలనలో విద్యుత్ రంగం విఫలం
- ప్రజలపై విద్యుత్ భారం మోపొద్దు: హరీశ్

03

# తాగేవారికే కొంత భారం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో ప్రివిలేజ్ ట్యాక్స్ రద్దు చేయాలంటూ తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ చేపట్టిన నిరసనలపై ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. ఈ పన్ను వల్ల బార్ల యాజమాన్యాలకు ఎలాంటి నష్టం ఉండదని, కేవలం మద్యం తాగే వారిపై మాత్రమే స్వల్ప భారం పడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఇవాళ మీడియాతో నిర్వహించిన చిట్ చాట్‌లో మాట్లాడుతూ మంత్రి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. హైదరాబాద్ సీటీని అప్ గ్రేడ్ చేశామని అందుకు అనుగుణంగానే బార్ లైసెన్స్ లు ఇచ్చామన్నారు. ఇతర రాష్ట్రాలలో ఉన్న విధంగానే బార్ లకు పర్మిషన్ ఇచ్చినట్లు వెల్లడించారు. మద్యం తాగడం తగ్గాలని గతంలో రేట్లు పెంచాం... అయినా పెద్దగా మార్పేమి లేదన్నారు. బీఆర్ఎస్ హాయాంలో 260 శాతం మద్యం అమ్మకాలు పెరిగాయని కేసీఆర్ హాయాంలో మద్యం ఆదాయం రూ.10 వేల కోట్ల నుంచి రూ.36 వేల కోట్లకు పెరిగిందన్నారు. ప్రస్తుతం రూ.40 వేల కోట్ల ఆదాయం వస్తోందని మేము వచ్చాక రూ.4వేల కోట్ల ఆదాయం మాత్రమే పెరిగిందన్నారు. లిక్కర్ ఉత్పత్తికి నీటి కొరత రాదన్నారు.

**కేసీఆర్‌ను అడగమని కేటీఆర్ చెబితే నేను అడగలేదు:**

మేము చట్టబద్ధంగా ముందుకు వెళ్తున్నామని ఊరికేనె అరెస్టులు చేయబోమన్నారు. కేసీఆర్ భూములపై వేసిన కమిటీ ఎంక్వరీ జరుగుతోందని త్వరలో అన్ని బయటపెడుతామన్నారు. మంత్రులు ఎలాంటి గందరగోళంలో లేరని గందరగోళం కావాలనుకునే వారు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు మాదేనని అభ్యర్థుల ప్రకటన తోనే గెలుపు డిసైడ్ అయిందన్నారు. కంటోన్మెంట్, ఖైరతాబాద్ తరహాలో ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లోనూ గెలుస్తామని దీంట్లో వింత ఏమీ లేదన్నారు. నేను అందరిలా ఎప్పుడు పడితే అప్పుడు మీడియాతొ మాట్లాడనని నా అవసరం ఉంది అనుకుంటే మాట్లాడుతానన్నారు. నేను మహబూబ్ నగర్ జైల్లో ఉంటే నన్ను పరామర్శించడానికి వైఎస్సార్ వచ్చారని ఆ సందర్భంలో తెలంగాణలో మోటార్లపై రైతులు ఆధార పడ్డారు.. ఫ్రీ కరెంట్ ఇవ్వాలని వైఎస్సార్‌ను నేను కోరినట్లు చెప్పారు. వైఎస్సార్‌ను చాలా అభిమానిస్తానని అయినా కొన్ని విషయాలు నేను నిర్మోహ్మాటంగా చెప్పేవాడినన్నారు. 2018లో నేను ఓడిపోయినప్పుడు... కేటీఆర్ నన్ను కలిసి ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ పదవి ఇవ్వాలని కేసీఆర్‌ను అడగమన్నారని కానీ నేను అడగలేదని చెప్పారు. నాకు సెల్ఫ్ రెస్పెక్ట్ ఇంపార్టెంట్ అని అందుకే బీఆర్ఎస్‌ను వీడినట్లు చెప్పారు.

**సాధ్యమైనంత వరకు వాడుకుంటాం:**

శ్రీశైలం నీటిని సాధ్యమైనంత మేరకు వాడుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. 854 అడుగుల కంటే శ్రీశైలంలో తక్కువ నీరు ఉంటే ఏపీ నీరు తరలించాడానికి అవకాశం లేదని.. దానిపై కోర్టు స్టే ఉందన్నారు. కృష్ణా వాటర్, డిండిపై సీఎం రేవంత్ రెడ్డితో నిన్న రివ్యూ జరిగిందని వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకం అంచనా పెంచుతూపోయారు.. దానికి తగ్గట్లు వాటర్ సోర్స్ పెంచలేదని విమర్శించారు. ఏదుల నుండి కాకుండా శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి తీసుకుంటే తెలంగాణకు ఉపయోగం ఉంటుందని సీఎంకు చెప్పామన్నారు. ఏదుల నుంచి వాటర్ తీసుకుంటే వచ్చే ఇబ్బందుల గురించి చెప్పామని, నల్లగొండకు శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి అచ్చంపేట్ మీదుగా ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఏదుల రిజర్వాయర్ నుంచి డిండికి వాటర్ విషయంలో సమగ్ర విచారణ చేయాలని అధికారులను సీఎం ఆదేశించినట్లు తెలిపారు. నీటి పొదుపు విషయంలో యూకేలో కార్ వాషింగ్ చేయొద్దని రూల్ పెట్టారని గుర్తు చేశారు.



## మహిళల భద్రతకు భరోసా!

**రాజన్న సిరిసిల్ల,ఫ్లాష్ ఇండియా :** మహిళలు, బాలికలు, విద్యార్థినిలు ఎలాంటి వేధింపులు ఎదురైన మౌనంగా భరించకుండా నిర్భయంగా ఫిర్యాదు చేస్తే ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. గడిచిన రెండు నెలల్లో షీ టీమ్‌కు వచ్చిన ఫిర్యాదులలో నాలుగు ఎఫ్ఐఆర్‌లు, 5 పెట్టి కేసులు నమోదు చేసి మహిళలను, విద్యార్థినులను వేధిస్తున్న వారిని గుర్తించి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో మహిళల, విద్యార్థినిల రక్షణకై పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని, మహిళలు, విద్యార్థినిలు, బాలికలు వేధింపులకు గురైనప్పుడు వెంటనే ఒక ఫోన్ కాల్ చేస్తే మీకు రక్షణ కవచంలా జిల్లా షీ టీమ్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, విద్యార్థినిలు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని వారితో పంచుకోవద్దని, సామాజిక మాద్యమాల్లో పరిచయమయ్యే వ్యక్తులతో మరింత అప్రమత్తం ఉండాలని సూచించారు. జిల్లాలో షీ టీమ్ బృందం విద్యాసంస్థల్లో, మహిళలు పని చేసే ప్రదేశాల్లో, రద్దీగల ప్రాంతాల్లో విద్యార్థులకు, మహిళలకు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, సోషల్ మీడియా మోసాలు, మహిళా చట్టాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో గుర్తించిన హాట్స్పాట్ వద్ద షీ టీమ్ బృందం నిత్యం మఫ్టీ డ్రెస్‌లలో నిఘా ఉంచి మహిళలను, విద్యార్థిని లను వేధించే ఆకతాయిలను అదుపులోకి తీసుకొని వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. విద్యా సంస్థల్లో, రోడ్డుపై వెళ్లేటప్పుడు, పని చేసే ప్రదేశాల్లో అవహేళనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే జిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 ఫిర్యాదు చేసినచో వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

# ఈసీని బీజేపీ అనుబంధ సంస్థలా మార్చేశారు

**కోహెడ,ఫ్లాష్ ఇండియా :** దేశంలో ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలా ఉండాల్సిన కేంద్ర ఎన్నికల సంఘం.. అధికార బీజేపీకి అనుబంధ సంస్థలా మారిపోయిందని రాష్ట్ర రవాణా , బీ.సి.సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కోహెడ మండలంలో 'పల్లె పల్లెకు పొన్నం అన్న' కార్యక్రమంలో భాగంగా మంత్రి పొన్నం ప్రభాకర్ పరివేద, నకర కొమ్ముల గ్రామలలో పర్యటించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. గ్రామ అభివృద్ధికి అదనంగా రూ. 10 లక్షలు కేటాయిస్తామని ప్రకటించారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తయితే పరివేదలోని 965 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. అనంతరం నకిరికొమ్ముల గ్రామంలో పత్రికా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ గతంలో ఒక్క అర్హులైన ఓటరు కూడా లిస్టు నుంచి గల్లంతు కాకూడదనే ఉద్దేశంతో సవరణలు జరిగేవని, కానీ ప్రస్తుతం కమిషన్ అధికారులు భయంతో, బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ఉన్న పేదల ఓట్లను ఉద్దేశపూర్వకంగా తొలగిస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటక, బీహార్, బెంగాల్ సహా పలు రాష్ట్రాల్లో ఎన్నికలకు ముందే గెలుపు కోసం ఇలాంటి కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఒక రాజకీయ పార్టీకి అధికార ప్రతినిధిలా వ్యవహరిస్తున్నారని, ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**గల్లీ గల్లీలో 'ఓట్ బచావో' పోరు..**

రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నేతలు స్పష్టం చేశారు. పేదలు, బడుగు బలహీన వర్గాల ఓట్లను కాపాడేందుకు కాంగ్రెస్‌తో పాటు ప్రజాస్వామిక పార్టీలన్నీ ఏకమై దేశవ్యాప్తంగా గల్లీ గల్లీలో 'ఓట్ బచావో - దేశ్ బచావో' పేరిట ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా గ్రామస్థాయి నుంచి ఈ కార్యక్రమాన్ని పెద్దఎత్తున ముందుకు తీసుకెళ్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల గొంతును వినకుండా కేవలం 'మన్ కీ బాత్' పేరుతో తమ మాటలే వినాలనే నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు. రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం పౌర సమాజం, రాజకీయ పార్టీలు ఏకమై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈసీ తీరు మారకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి , డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య, జడ్పీ సీఈఓ రమేష్, పరివేద గ్రామ సర్పంచ్ మీస కొమురయ్య, నకిరే కొమ్ముల సర్పంచ్ బుర్ర కళ్యాణి మహేష్, మండల అధ్యక్షుడు శెట్టి సుధాకర్, ఏఎంసీ చైర్ పర్సన్ బోయిన నిర్మల జయరాజ్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ వణుకుపుట్టిస్తున్న 'బర్డ్ ఫ్లూ'..

## ఏకంగా 2,500 కోళ్లు ఒకేసారి మృత్యువాత

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ మళ్లీ వణుకు పుట్టిస్తోంది. తెలంగాణలోని ఆదిలాబాద్ నుంచి అనంతపురం జిల్లాకు దిగుమతి చేసుకున్న కోళ్లలో ఏవియన్ ఇన్‌ఫ్లుఎంజా వైరస్ పంజా విసరడంతో కేవలం కొన్ని రోజుల వ్యవధిలోనే ఏకంగా 2,500 కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన స్థానికంగానే కాకుండా రెండు రాష్ట్రాల్లో పౌల్ట్రీ పరిశ్రమలో తీవ్ర ఆందోళనను రేకెత్తిస్తోంది.

**ఆదిలాబాద్ నుంచి కోళ్ల కొనుగోలు..**

అనంతపురం జిల్లా సిద్ధరాంపురానికి చెందిన వెంకటరాముడు అనే వ్యక్తి జాతీయ పశు సంవర్ధక మిషన్ కింద ఇటీవల ఈ పౌల్ట్రీ ఫారమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో తెలంగాణలోని ఆదిలాబాద్ ప్రాంతం నుంచి ఒకే బ్యాచ్‌లో 2,500 కోళ్లను ఫారమ్‌కు తీసుకొచ్చారు. అయితే, ఆ కోళ్లు ఫారమ్‌కు చేరుకున్న కొద్ది రోజులకే అనారోగ్యం బారినపడి ఒక్కొక్కటిగా చనిపోవడం ప్రారంభించాయి. ఈ మరణాలు క్రమంగా మొత్తం మందకు వ్యాపించాయి.

**భోపాల్ ల్యాబ్‌లో బర్డ్ ఫ్లూ నిర్ధారణ..**

ఇంత పెద్ద సంఖ్యలు ఒకేసారి కోళ్లు మృతి చెందడంతో ఆందోళన చెందిన నిర్వాహకులు అధికారులకు సమాచారం అందించారు. దీంతో పశుసంవర్ధక శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగి మృతి చెందిన కోళ్ల నమూనాలను సేకరించారు. వాటిని భోపాల్ లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ కు పరీక్షల నిమిత్తం పంపగా.. తాజాగా వచ్చిన నివేదికలో బర్డ్ ఫ్లూ ఉన్నట్లుగా తేలింది.

**కంటైన్మెంట్ చర్యలు..**

ఇక బర్డ్ ఫ్లూ నిర్ధారణ కావడంతో పశు సంవర్ధక, వైద్య, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు సంయుక్తంగా సిద్ధరాంపురం గ్రామాన్ని సందర్శించి కంటైన్మెంట్ చర్యలు చేపట్టారు. బర్డ్ ఫ్లూ ప్రభావిత ఫారమ్‌ను, సజీవంగా ఉన్న మిగతా కోళ్లను అధికారులు క్వారంటైన్‌లో ఉంచారు. గుడ్లు, కోళ్ల ఎరువు, సైలేజ్, నేల, వైరస్ సోకడానికి అవకాశం ఉన్న ఇతర వస్తువులను పూర్తిగా వేరు చేసి భద్రపరిచారు. ఫారమ్ చుట్టూ 10 కి.మీ పరిధిలో నివారణ, నిఘా చర్యలు చేపట్టారు. వైరస్ మరింత వ్యాపించకుండా చనిపోయిన పక్షులను సురక్షితంగా ఖననం చేయడం, దహనం చేస్తున్నారు.

**3 నెలల పాటు రవాణా ఆంక్షలు**

పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ ప్రేమ్‌చంద్ మాట్లాడుతూ.. గ్రామంలోకి, గ్రామ బయటకు కోళ్లు, గుడ్ల రవాణాపై రానున్న 3 నెలల పాటు కఠిన ఆంక్షలు అమల్లో ఉంటాయని తెలిపారు. ఈ నిబంధనలను పక్కాగా అమలు చేసేందుకు గ్రామంలో పోలీసులను మోహరించారు. స్థానిక ప్రజలు ఎవరికైనా జ్వరం, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అలాగే పౌల్ట్రీ ఉత్పత్తుల నిర్వహణ, వినియోగంలో తప్పనిసరిగా ఆరోగ్య, పశువైద్య శాఖల సలహాలు పాటించాలని హెచ్చరించారు. గతంలో 2025 ఫిబ్రవరిలో ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో బర్డ్ ఫ్లూ వెలుగుచూసిన విషయం తెలిసిందే.

# ఏసీబీకి పట్టుబడ్డ కారోబార్



**సిద్దిపేట,ఫ్లాష్ ఇండియా :** ఇంటి మోటేషన్ కోసం లంచం డిమాండ్ చేసిన గ్రామ కారోబార్ ఏసీబీకి పట్టుబడిన సంఘటన సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళ్తే జక్కాపూర్ గ్రామానికి చెందిన కయ్యాల కిషన్‌కు సంబంధించిన ఇంటి మోటేషన్ చేసేందుకు గ్రామ కారోబార్ సంతోష్ రూ.15 వేలు లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో కిషన్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఈ మేరకు పథకం ప్రకారం లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు కారోబార్ సంతోష్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మరిన్ని పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# భౌతిక శాస్త్రంలో బెల్జియం దేశ శాస్త్రవేత్తకు నోబెల్




**ఢిల్లీ :** బెల్జియం దేశానికి చెందిన భౌతిక శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ హాల్జెన్‌కు అత్యున్నత పురస్కారం దక్కింది. భౌతికశాస్త్రంలో ఆయన చేసిన పరిశోధనలకు గానూ నోబెల్ వరించింది. ఈయన ఐస్ క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీ ఏర్పాటులో కీలక పాత్ర పోశించారు. అంతరిక్షం నుండి వచ్చే అధిక శక్తి న్యూట్రినోలను కనుగొనడంలో విశేష పరిశోధనలకు గానూ ఆయనకు నోబెల్ పురస్కారాన్ని అందించారు. మరోవైపు వైద్యశాస్త్రంలో ఆప్టోజెనెటిక్స్ అనే సాంకేతికతను అభివృద్ధి చేసినందుకు ముగ్గురు శాస్త్రవేత్తలు సైతం నోబెల్ బహుమంతి అందుకున్నారు. అమెరికాకు చెందిన కార్ల్ డీసెరోత్, జర్మనీకి చెందిన పీటర్ హెగెమన్, జార్జ్ నాగెల్ 2026 నోబెల్ ఫిజియాలజీ/ మెడిసిన్ పురస్కారం దక్కించుకున్నరు.లైట్ గేటెడ్ అయాన్ చానల్స్, ఆప్టోజెనెటిక్స్‌కు సంబంధించిన ఆవిష్కరణలు చేసినందుకు స్వీడన్ లోని కరోలిన్స్కా ఇనిస్టిట్యూట్‌కు చెందిన నోబెల్ అసెంబ్లీ వీరిని ఎంపిక చేసింది. మెదడులో జీవించి ఉన్న మెదడులోని వ్యక్తిగత నాడీ కణాల కార్యకలాపాలను ఆన్ లేదా ఆఫ్ చేయడం ఈ పద్ధతి ద్వారా సాధ్యపడుతుందని కరోలిన్స్కా ఇన్ స్టిట్యూట్ లోని నోబెల్ అసెంబ్లీ జనరల్ పెర్ల్ మన్ పేర్కొన్నారు. మెదడులోని రహస్యాలను బయటకు తీసేందుకు ఈ పద్ధతిని ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రయోగశాలల్లో ఉపయోగిస్తున్నారని ఆయన చెప్పారు.

# వాయుసేన నూతన చీఫ్‌గా అశుతోష్ దీక్షిత్..



**ఢిల్లీ :** భారత వాయుసేన కొత్త అధిపతిగా ప్రస్తుత వైస్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత వాయుసేన చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ పదవీకాలం అక్టోబర్ 31తో ముగియనుండటంతో, ఆయన స్థానంలో అశుతోష్ దీక్షిత్ 29వ వాయుసేన బాధ్యతలు చేపట్టనున్నారు. అక్టోబర్ 31న మధ్యాహ్నం నుంచి ఆయన ఎయిర్ చీఫ్ మార్షల్ హోదాలో వాయుసేన బాధ్యతలను అధికారికంగా స్వీకరించనున్నారు.

**అశుతోష్ దీక్షిత్ అనుభవం, ప్రత్యేకతలు ఇవే..**

డిసెంబర్ 1986లో ఐఏఎఫ్ ఫైటర్ స్ట్రీమ్‌లో కమిషన్ పొందిన అశుతోష్ దీక్షిత్.. ఓ ఎక్స్‌పెరిమెంటల్ టెస్ట్ పైలట్, క్వాలిఫైడ్ ఫ్లైయింగ్ ఇన్‌స్ట్రక్టర్. ఆయనకు మిరాజ్-2000, జాగ్వార్, తేజస్ వంటి వివిధ రకాల యుద్ధ విమానాలతో పాటు సుమారు 3,500 గంటలకు పైగా విమానాలు నడిపిన అనుభవం ఉంది. తన సుదీర్ఘ సేవా కాలంలో సెంట్రల్ ఎయిర్ కమాండ్ ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్‌గా, ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ చీఫ్‌గా పలు కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అంతేకాకుండా ఆపరేషన్ సఫేద్ సాగర్ , ఆపరేషన్ రక్షక్ వంటి కీలక ఆపరేషన్లలో క్రియాశీలకంగా పాల్గొని విశేష సేవలందించారు. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన తేజస్ తదితర ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించారని, రాబోయే రోజుల్లో ప్రభుత్వ ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యానికి ఆయన నియామకం మరింత ఊతమిస్తుందని రక్షణ రంగ నిపుణులు పేర్కొంటున్నారు.



## సిద్దిపేటలో ఆఫీస్ ఓపెన్ చేస్తా

**సిద్దిపేట,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో మాజీ సీఎం కేసీఆర్ వ్యక్తిగత సహాయకుడు కూర వెంకట నారాయణ తల్లి మరణించడంతో వారిని వారి కుటుంబ సభ్యులను కవిత పరామర్శించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ... సిద్దిపేటలో పోటీ అంశంలో పార్టీ ఇంకా ఏమీ నిర్ణయం తీసుకోలేదన్నారు. సిద్దిపేట నా అమ్మగారి ఇల్లు సిద్దిపేటకు ఎప్పుడైనా వస్తా పోతా అన్నారు. సిద్దిపేట లో తెలంగాణ రక్షణ సేన పార్టీ కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడతామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల వారిగా సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పెద్ద ఎత్తున సభ ఏర్పాటు చేస్తా అన్నారు. సిద్దిపేటలో కార్యాచరణ బలంగా తీసుకుంటా అన్నారు. సిద్దిపేట లో సైతం ఆఫీస్ ఓపెన్ చేస్తా అన్నారు. తెలంగాణ రక్షణ సమితి క్యాడర్ నిర్మాణం పెద్ద ఎత్తున చేపట్టినట్లు తెలిపారు. గ్రామ గ్రామనా యువకులు మహిళలు, ఆడ బిడ్డలు పెద్ద ఎత్తున పార్టీలోకి చేరుతున్నట్లు వెల్లడించారు.

# ఓట్ల తొలగింపుపై ఒవైసీ ఫైర్..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో ముస్లిం ఓట్లను పథకం ప్రకారం తొలగించేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర ఆరోపణలు చేశారు. సచివాలయంలోని మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఎలక్షన్ కమిషన్‌లో ఏం జరుగుతుందో అర్థం కావడం లేదని అనుమానాలు వ్యక్తం చేశారు. అసలు ఎన్నికల కమిషన్‌కు, భారతీయ జనతా పార్టీకి ఉన్న సంబంధం ఏంటని ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఒక నిర్దిష్ట సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని బీజేపీ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. కేంద్రంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎంపిక ప్రక్రియే సరైన విధానంలో జరగలేదని విమర్శించిన ఒవైసీ, ప్రస్తుత 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' పేరుతో వెనుక తలుపు గుండా ఎన్ఆర్సీ ని తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

**ఒడిశాలో తోలు వ్యాపారుల ఆవేదన.. సీఎం జోక్యానికి విజ్ఞప్తి**

రాష్ట్రంలోని తోలు వ్యాపారులు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై కూడా ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడారు. తెలంగాణ నుంచి మేకలు, బర్రెలు, ఆవుల తోలును సేకరించి ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు రవాణా చేస్తూ చట్టబద్ధంగా వ్యాపారం చేసుకుంటున్నారని, ప్రభుత్వానికి క్రమం తప్పకుండా 5 శాతం జీఎస్టీ చెల్లిస్తున్నారని గుర్తుచేశారు. అయినప్పటికీ, గత ఆరు నెలలుగా ఒడిశాలో తెలంగాణకు చెందిన తోలు ట్రక్కులను అన్యాయంగా నిలిపివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యాపారంపై దాదాపు 10,000 మంది జీవనం సాగిస్తున్నారని, లారీలను అడ్డుకోకుండా ఒడిశా ప్రభుత్వంతో మాట్లాడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరినట్లు వెల్లడించారు. తెలంగాణ ముఖ్యమంత్రి స్వయంగా ఒడిశా సీఎంతో మాట్లాడి తోలు వ్యాపారుల లారీలను విడిపించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**ఎల్‌నినో కరువు పరిస్థితులపై సమగ్ర నివేదికకు సీఎస్ ఆదేశం**

మరోవైపు, రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం వల్ల తలెత్తిన వర్షాభావం, కరువు పరిస్థితులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న కరువు పరిస్థితులపై పూర్తి స్థాయి నివేదికను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. అక్టోబర్ మాసాంతంలోగా ఎల్‌నినో ప్రభావం, పంట నష్టం, తాగు నీటి ఎద్దడి తదితర అంశాలపై సమగ్ర నివేదికను రూపొందించాలని సంబంధిత శాఖలకు సీఎస్ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి 7730032999 flashindiadaily@gmail.com

## టీ బీజేపీ సంచలన నిర్ణయం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య భూముల వ్యవహారంపై విమర్శలు ప్రతివిమర్శలు పీక్స్ కు చేరుకున్న వేళ తెలంగాణ బీజేపీ సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని భూముల వ్యవహారంపై ప్రజెంటేషన్ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఈ మేరకు బీజేఎల్పీ లీడర్ మహేశ్వర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ నెల 10న భూ వ్యవహారాలపై బీజేపీ ప్రజెంటేషన్ ఇవ్వబోతోందని వెల్లడించారు. ఈ ప్రజెంటేషన్ లో భూకంభకోణాలపై వివరిస్తామన్నారు.

**చీకటి ఒప్పందం:**

కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం ఉందని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. కేటీఆర్, రేవంత్ రెడ్డి ఆస్తులు బయటపెట్టింది ఒక శాతమేనన్నారు. 22-ఏలో తప్పిదాలు జరిగాయని మంత్రులు ఒప్పుకున్నారని ఫోరెన్సిక్ ఆడిట్ తో వాస్తవాలు బయటకు రావాలన్నారు. కాగా 22 ఏ భూముల విషయంలో గత నెలలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఏలేటి మహేశ్వర్ రెడ్డి వర్సెస్ ప్రభుత్వం మధ్య వాడీవేడీగా డైలాగ్ వార్ నడిచింది. ఈ నేపథ్యంలో ఈ నెల 10న ఇవ్వబోయే ప్రజెంటేషన్ లో ఎలాంటి విషయాలను బీజేపీ బయటకు తీసుకురాబోతోంది అనేది ఉత్కంఠ రేపుతోంది.

## గాజులరామారం ఇందిరమ్మ టవర్స్

**కుత్బుల్లాపూర్,ఫ్లాష్ ఇండియా :** నియోజకవర్గ పరిధిలోని కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం సర్వే నంబర్ 346లో చేపట్టనున్న ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన భూమిపూజలో మహిళల చేత ఇటుకను పెట్టించారు. పూజలో భాగంగా తొలుత మహిళలు కొబ్బరికాయ కొట్టి వెళ్లిపోతుండగా, మంత్రి పొంగులేటి వారిని వెనక్కి పిలిచి మరీ ఇటుకను అందించి భూమిపూజలో భాగంగా ఇటుకను పెట్టించారు.

**మాజీ ఎమ్మెల్యేకు దక్కని చోటు..**

భూమిపూజ అనంతరం స్టేజ్‌పైకి అతిథులు ఆశీనులయ్యారు. అయితే మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ స్టేజ్ కిందనే కుర్చీలో ఉండిపోయారు. తెలంగాణ జాతీయ గీతం ఆలాపన నుంచే అభిమానులు, కార్యకర్తలు ఆయనను స్టేజ్‌పైకి పిలవాలని సంజ్ఞలు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో గీతాలాపన అనంతరం ఒక్కసారిగా ఆయన అభిమానులు నినాదాలు చేశారు. దీంతో తేరుకున్న నిర్వాహకులు ఆయనను స్టేజ్‌పైకి ఆహ్వానించారు.

**ఎమ్మెల్యే ప్రసంగంలో పోటాపోటీ నినాదాలు..**

అయితే సభ ప్రారంభంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద ప్రసంగం ప్రారంభించగానే ఆయన అభిమానులు నినాదాలు చేయగా, కాంగ్రెస్ కార్యకర్తలు పోటీగా నినాదాలు చేశారు. దీంతో సభ ప్రారంభంలో కొద్దిసేపు గందరగోళం ఏర్పడింది. పోలీసులు సర్దిచెప్పడంతో పోటాపోటీ నినాదాలు సద్దుమణిగాయి.

## కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం..



**ఢిల్లీ :** దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర కేబినెట్ సంచలన నిర్ణయాలు తీసుకుంది. చిన్న, మధ్యతరహా పరిశ్రమల వృద్ధికి భారీ ఊతమిస్తూ ఏకంగా రూ.10,000 కోట్ల ఎంఎస్ఎంఈ గ్రోత్ ఫండ్ కు ఆమోదం తెలిపింది. అదేవిధంగా రవాణా రంగాన్ని సమూలంగా మార్చేందుకు ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్టు అండ్ లాజిస్టిక్స్ అథారిటీ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**రూ.10,000 కోట్ల ఫండ్‌కు ఆమోదం..**

చిన్న, మధ్యతరహా పరిశ్రమల వృద్ధిని వేగవంతం చేయడానికి, వాటికి ప్రత్యక్ష ఈక్విటీ పెట్టుబడులు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.10,000 కోట్ల నిధిని కేటాయించింది. చిన్న వ్యాపారాలుగా ఉన్న సంస్థలు ఉన్నత స్థాయికి ఎదగడానికి, గ్లోబల్ మార్కెట్‌లో ఇతర దేశాల కంపెనీలతో దీటుగా పోటీ పడేందుకు ఈ ఫండ్ ఎంతగానో దోహదపడుతుంది. తాజా నిధులలో ఎక్కువ భాగం చిన్న, మధ్యతరహా తయారీ రంగాలకు, అలాగే ఇతర పారిశ్రామిక కార్యకలాపాలు నిర్వహించే సంస్థలకు కేటాయించనున్నారు. కేవలం స్వల్పకాలిక రుణాలకే పరిమితం కాకుండా, ఈక్విటీ రూపంలో మూలధన సహాయం అందించడం ద్వారా చిన్న వ్యాపారాలపై ఉన్న రుణ భారాన్ని గణనీయంగా తగ్గించనున్నారు.

**ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్టు అండ్ లాజిస్టిక్స్ అథారిటీ ..**

దేశంలో రవాణా, లాజిస్టిక్ రంగాల సమగ్ర అభివృద్ధి, పరిశోధన అలాగే వివిధ రవాణా మార్గాల అనుసంధానానికి నేషనల్ మాస్టర్ ప్లాన్‌ను రూపొందించేందుకు కేంద్రం ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్టు అండ్ లాజిస్టిక్స్ అథారిటీ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఈ అథారిటీ ద్వారా రైల్వేలు, రోడ్లు, పోర్టులు, విమానయాన రంగాలు మరింత మెరుగైన పద్ధతిలో అనుసంధానం కానున్నాయి. దేశవ్యాప్తంగా చేపడుతున్న భారీ మౌలిక వసతుల ప్రాజెక్టుల ప్రణాళిక, వాటి అమలును పర్యవేక్షించడంలో ఈ అథారిటీ అత్యంత కీలక పాత్ర పోషించనుంది.

## ఆర్టీసీ బస్సులో ఎమ్మెల్యే.. మహిళలు, విద్యార్థులతో ముచ్చట!



**ఇబ్రహీంపట్నం,ఫ్లాష్ ఇండియా :** ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి మహిళలు, విద్యార్థులకు అందుతున్న ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని స్వయంగా పరిశీలించారు. రంగారెడ్డి కలెక్టరేట్‌లో కార్యక్రమానికి హాజరై తిరిగి వెళ్తున్న ఆయన బొంగ్లూర్ ఓఆర్ఆర్ వద్ద ఆగి, ఇబ్రహీంపట్నం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎక్కారు. కండక్టర్ వద్ద టికెట్ తీసుకుని ప్రయాణికులతో కలిసి కొంతదూరం ప్రయాణించారు.

**మహిళలు, విద్యార్థులతో మాటామంతీ..**

బస్సులో ప్రయాణిస్తున్న మహిళలు, విద్యార్థినులతో ఎమ్మెల్యే మాట్లాడి మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణం ఎలా ఉపయోగపడుతోందో తెలుసుకున్నారు. కళాశాల బస్సులకు గతంలో భారీగా చార్జీలు చెల్లించాల్సి వచ్చేదని, ప్రస్తుతం ఉచిత ఆర్టీసీ ప్రయాణంతో ఆర్థిక భారం తగ్గిందని పలువురు విద్యార్థినులు తెలిపారు. మహిళలు సైతం ఉచిత ప్రయాణం వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఎమ్మెల్యేకు వివరించారు.

**సిబ్బంది సమస్యలపై ఆరా..**

డ్రైవర్, కండక్టర్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే బస్సు నిర్వహణ, ప్రయాణికుల పరిస్థితిపై ఆరా తీశారు. సిబ్బంది తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**ఇబ్రహీంపట్నం డిపో లో లక్ష మందికి పైగా ఉచిత ప్రయాణం..**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా రోజూ దాదాపు 40 లక్షల మంది ఉచితంగా ప్రయాణిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఇబ్రహీంపట్నం డిపో పరిధిలోనే లక్ష మందికి పైగా మహిళలు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. కాలం చెల్లిన బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను తీసుకొస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసిందని విమర్శించిన ఆయన, తమ ప్రభుత్వం యూనియన్ల పునరుద్ధరణతో పాటు గుర్తింపు సంఘం ఎన్నికలను నిర్వహించిందని పేర్కొన్నారు.

## రైతులకు కోతలు.. ప్రజలకు వాతలు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, విద్యుత్ రంగ వైఫల్యాలపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర స్థాయిలో మండిపడింది. దసరా, దీపావళి పండుగల వేళ ప్రజలకు శుభవార్తలు చెప్పాల్సింది పోయి, ట్రూ-అప్ ఛార్జీల పేరుతో ఏకంగా రూ.5,420 కోట్ల భారాన్ని ప్రజల నెత్తిన రుద్దాలని ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ఒకవైపు కరెంట్ కోతలు, మరోవైపు భారీ విద్యుత్ బిల్లులతో ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ హయాంలో గతంలో రూ.12,700 కోట్లకు పైగా ట్రూ-అప్ ఛార్జీలు వేయాలని ఈఆర్సీ సూచించినా, ప్రజలపై ఆ ఆర్థిక భారాన్ని మోపడానికి కేసీఆర్ ఎప్పుడూ అనుమతించలేదని గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రస్తుత విద్యుత్ సంక్షోభానికి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వహణ లోపాలు, సంపూర్ణ నిర్లక్ష్యమే కారణమని హరీశ్ రావు స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రూ.91 వేల కోట్లతో విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసి, సబ్ స్టేషన్లను, ఉత్పాదక సామర్థ్యాన్ని గణనీయంగా పెంచి 24 గంటల నిరంతర నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందించామని తెలిపారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బొగ్గు నిల్వలు, రిజర్వాయర్లలో నీటిని సద్వినియోగం చేసుకోలేక విద్యుత్ ఉత్పత్తిని పూర్తిగా దెబ్బతీశారని ఆరోపించారు. సరైన నిర్వహణ లేక థర్మల్ ప్లాంట్లు మూతపడుతున్నాయని, కరెంట్ సరఫరా లేక రైతులు పొలాల వద్ద పడిగాపులు కాస్తూ పాము కాట్లకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువు అని ఆయన తీవ్రంగా విమర్శించారు. చాలదన్నట్లుగా వేల కోట్ల విలువైన ట్రాన్స్‌కో, జెన్కోలను ప్రైవేటుపరం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తోందని దుయ్యబట్టారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ పబ్లిక్ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తారని, కానీ ఇక్కడ కాంగ్రెస్ సర్కార్ మాత్రం ప్రభుత్వ సంస్థలను అమ్మకానికి పెడుతోందని ఎద్దేవా చేశారు. తక్షణమే ట్రూ-అప్ ఛార్జీల పేరుతో ప్రజలపై మోపుతున్న రూ.5,420 కోట్ల భారాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవాలని, ఈ మొత్తాన్ని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక తుగ్లక్ నిర్ణయాలను వెనక్కి తీసుకునే వరకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్గదర్శనంలో పెద్దఎత్తున ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## మిర్యాలగూడలో 24 గంటల తాగునీటి లక్ష్యంతో అమృత్ 2.0 పనులు...



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ పట్టణ ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి,ప్రతి ఇంటికి 24 గంటల పాటు నాణ్యమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేస్తున్న అమృత్ స్కీమ్ 2.0 పనులను మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్ద దేవులపల్లి వద్ద అమృత్ 2.0 పథకం కింద నిర్మిస్తున్న నూతన పంప్ హౌస్ మరియు నూతన పైప్‌లైన్ నిర్మాణ పనులను పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించి, పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పాటు నిర్ణీత గడువులోపు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మిర్యాలగూడ పట్టణంలో వివిధ ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న 12 నూతన ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకుల పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి,పట్టణ ప్రజలకు నిరంతరాయంగా 24 గంటల తాగునీటి సరఫరా అందేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ...**

మిర్యాలగూడ పట్టణంలో తాగునీటి సమస్య గతంలో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని,ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అమృత్ 2.0 పథకం పూర్తయిన అనంతరం పట్టణ ప్రజలకు నాణ్యమైన,నిరంతర తాగునీటి సరఫరా అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీజరెడ్డి,పబ్లిక్ హెల్త్ ఎస్సి వెంకటేశ్వర్లు,ఇతర అధికారులు,కాంట్రాక్టర్,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలి

**చైతన్యపురి,ఫ్లాష్ ఇండియా :** మహిళలు స్వయంకృషితో ఎదిగి ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చైతన్యపురి డివిజన్ పరిధిలోని న్యూ దిల్‌సుఖ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో గత కొన్ని రోజులుగా నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ, బ్యూటీషియన్, మెహందీ కోర్సులు పూర్తయిన సందర్భంగా మహిళలకు సర్టిఫికెట్లను ట్రస్ట్ చైర్మన్ కమల సుధీర్ రెడ్డిలతో కలిసి అందజేసి మాట్లాడారు. మహిళ చేతిలో నైపుణ్యం ఉంటే ఆకుటుంబం ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతుందని తద్వారా సమాజం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి, స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలనే లక్ష్యంతో జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణలో ప్రాథమిక స్థాయి నుంచి ఆధునిక కుట్టు నైపుణ్యాలతో పాటు బ్యూటీషియన్, మెహందీ వంటి ఉపాధి అవకాశాలకు ఉపయోగపడే కోర్సుల్లో సమగ్ర శిక్షణ అందిస్తున్నట్లు వెల్లడించారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన మహిళలు ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయడంతో పాటు, తమ కుటుంబ ఆర్థిక అభివృద్ధికి బలమైన పునాది వేసుకునే అవకాశం పొందుతారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి, యువ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, రంగేశ్వరి నాయుడు, నర్సిరెడ్డి, రాపోలు సుధాకర్, విశ్వప్రేమ్, శివాప్రకాష్, నాగలక్ష్మి, జయశ్రీ, శోభరాణి ట్రైనర్లు సనీత, భానుప్రియ, శివబిందు, అర్చన ట్రస్ట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్లకు సీఎం ఏం ఇచ్చారు?

**వేములవాడ,ఫ్లాష్ ఇండియా :** వేములవాడ పట్టణంలో టీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు 'కవిత' మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయంతో పాటు నియోజకవర్గంలోని పలు ప్రజా సమస్యలను ఆమె ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్రం, టీఆర్ఎస్ పార్టీ బాగుండాలని రాజన్నను వేడుకున్నట్లు ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వేములవాడ రాజన్న ఆలయానికి ఎంతో చరిత్ర ఉందని.. ఆలయానికి ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించడంపై బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటీ పడుతున్నాయని, ఎవరు నిధులు ఇచ్చినా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఆలయ నిర్మాణంలో కాంక్రీట్‌కు బదులుగా కృష్ణశిలను ఉపయోగించాలని ఆమె కోరారు. రాజన్న ఆలయంలో కోడెలు మృతి చెందుతున్నా రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి బండి సంజయ్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వేములవాడలో రోడ్లు, మార్కెట్, డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని కవిత పేర్కొన్నారు. చేపట్టిన పలు పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని, రైతుల కోసం సరైన మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వేములవాడ పట్టణంలో దుమ్ము సమస్య తీవ్రంగా ఉందని, డ్రైనేజీ పనులపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాలని కోరారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. రాజన్న చెరువు ప్రక్షాళన కోసం విప్ ఆది శ్రీనివాస్ నిధులు తీసుకురావాలని కవిత డిమాండ్ చేశారు. గతంలో కేటీఆర్ మంత్రిగా ఉన్న సమయంలో సిరిసిల్లను అభివృద్ధి చేశారని, ప్రస్తుతం వేములవాడ అభివృద్ధి బాధ్యతలు చూస్తున్న ఆది శ్రీనివాస్ నియోజకవర్గ సమస్యలపై దృష్టి పెట్టాలని అన్నారు. అధికార దర్పం కోసం ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దని సూచించారు. తన తల్లిదండ్రుల వివాహం కూడా వేములవాడలోనే జరిగిందని కవిత గుర్తుచేశారు. ఈ ప్రాంతంతో తమ కుటుంబానికి అనుబంధం ఉందన్నారు. వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాలకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఇప్పటివరకు నీటి బొట్టు కూడా రాలేదని ఆమె విమర్శించారు. గత ప్రభుత్వంలో మంత్రి హరీశ్‌రావు చెప్పిన ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని కోరారు. రుద్రంగి వద్ద రూ.200 కోట్లతో 2.5 టీఎంసీల రిజర్వాయర్ నిర్మిస్తామని గతంలో చెప్పారని, ఆ హామీ ఏమైందని కవిత ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఈ ప్రాంత రైతులకు ప్రయోజనం కలగడం లేదని అన్నారు. రైతుల కోసం మంత్రి బండి సంజయ్, ఆది శ్రీనివాస్ తమ పలుకుబడిని ఉపయోగించి రుద్రంగి, ధూంపేట తదితర ప్రాంతాల్లోని చెరువులకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు నిరంతర విద్యుత్ అందించాలని కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్‌ను కొనుగోలు చేస్తుందో, అడుక్కుంటుందో తమకు తెలియదని, కానీ రైతులకు మాత్రం కరెంట్ అందాల్సిందేనని అన్నారు. ప్రజా సమస్యలపై టీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. సిరిసిల్లకు ముఖ్యమంత్రి ఏదో ఒక భారీ ప్రకటన చేస్తారని భావించినప్పటికీ, ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని కవిత విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు అభివృద్ధికి సంబంధించి ఎలాంటి కీలక ప్రకటన చేయలేదన్నారు. సిరిసిల్లలో గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామని గతంలో చెప్పారని, అయితే ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉందని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డికి రాజకీయాలు చేయడం తప్ప అభివృద్ధి చేయడం తెలియదని కవిత విమర్శించారు. రైల్వే లైన్ పనులు కూడా అక్కడక్కడ నిలిచిపోయాయని, వాటిని పూర్తి చేయాలని టీఆర్ఎస్ తరఫున పోరాటం చేస్తామని తెలిపారు. గల్ఫ్ కార్మికులకు అన్యాయం జరుగుతోందని, గల్ఫ్ అడ్వైజరీ కమిటీ నుంచి సభ్యులు తప్పుకుంటున్నారని అన్నారు. సిరిసిల్ల జేఎన్‌టీయూ విద్యార్థులు ల్యాబ్ సౌకర్యాల కోసం జగిత్యాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని కవిత పేర్కొన్నారు. మెడికల్ కళాశాలలోనూ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎమ్మెల్యే కేటీఆర్, ఆది శ్రీనివాస్, బండి సంజయ్ స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ (సెస్)కు దేశంలోనే ప్రత్యేక చరిత్ర ఉందని కవిత అన్నారు. సెస్‌ను ఎన్‌పీడీసీఎల్‌లో విలీనం చేసిన తర్వాత విద్యుత్ పోల్ దెబ్బతిన్నా పట్టించుకునే వారు లేకుండా పోయారని ఆరోపించారు. సెస్‌లో గతంలో అవినీతి జరిగిందని, ఫైర్ ప్రమాదంలో కీలక ఫైల్స్ కాలిపోయాయని ఆమె వ్యాఖ్యానించారు. నేరెళ్ల బాధితుల ఫైల్స్ కూడా కాలిపోయాయని కవిత ఆరోపించారు. సీఎం సిరిసిల్ల సభలో నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగేలా టీఆర్ఎస్ పార్టీ తరఫున అండగా ఉంటామని తెలిపారు. కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యల మధ్య పొంతన లేదని కవిత విమర్శించారు. రేవంత్‌రెడ్డి పదేళ్లు తానే సీఎంగా ఉంటానని చెబుతుంటే, మరోవైపు బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని పార్టీ నేతలు చెబుతున్నారని అన్నారు. ఈ పరిణామాలను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్ మధ్య "విడాకులు అయ్యాయి" అంటూ కవిత వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పాలనలో జర్నలిస్టులకు కూడా అన్యాయం జరుగుతోందని కవిత ఆరోపించారు. ముఖ్యంగా ముస్లిం జర్నలిస్టులకు అక్రిడిటేషన్ విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వ్యాఖ్యానించారు. మాజీ మావోయిస్టులు టీఆర్ఎస్ పార్టీలోకి రావాలని కవిత పిలుపునిచ్చారు. వారిని పార్టీలోకి స్వాగతిస్తామని, మావోయిస్టుల కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కవిత అన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని తెలిపారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేట్ విద్యా రంగంపై నియంత్రణ తీసుకొస్తామని, ప్రస్తుతం ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఇంకా ముంపు గ్రామాల సమస్యలపైనా పోరాటం చేస్తామని కవిత అన్నారు. వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాల ప్రజా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు.

## ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల రద్దు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్‌లోని ప్రముఖ కాసు బ్రహ్మానంద రెడ్డి పార్క్ చుట్టూ ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం రూ.1,090 కోట్లతో ప్రతిపాదించిన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ ప్రణాళికల్లో ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. ఈ మేరకు కేబీఆర్ పార్క్ పరిసర ప్రాంతాల్లో చేపట్టాల్సిన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ ప్రతిపాదనలను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.

**పర్యావరణ పరిరక్షణే ప్రాధాన్యత.. ప్రాజెక్ట్ రద్దు**

నగరంలో పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని, వ్యూహాత్మక రోడ్డు అభివృద్ధి ప్రణాళిక లో భాగంగా కేబీఆర్ పార్క్ చుట్టూ ఉన్న ప్రధాన జంక్షన్లలో మల్టీ-గ్రేడ్ సెపరేటర్లు, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించాలని గతంలో ప్రణాళిక రూపొందించారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ పరిసరాల్లో నిత్యం ఏర్పడే ట్రాఫిక్ జామ్‌లకు చెక్ పెట్టడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును తలపెట్టారు. అయితే, ఈ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం వల్ల కేబీఆర్ పార్క్ చుట్టూ ఉన్న పచ్చదనం దెబ్బతింటుందని, వందలాది విలువైన చెట్లను నరకాల్సి వస్తుందని పర్యావరణ వేత్తలు, స్థానిక నివాసితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పార్క్ జీవ వైవిధ్యాన్ని, పర్యావరణ సమతుల్యతను కాపాడాలని కోరుతూ పలువురు ఆందోళనలు చేపట్టి ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందజేశారు. ప్రజాభిప్రాయాన్ని, పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను గుర్తించిన ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌ను రద్దు చేయడమే సరైన నిర్ణయమని భావించింది.

**ప్రత్యామ్నాయ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ప్రణాళికలు..**

భారీ కాంక్రీట్ నిర్మాణాలైన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల రద్దుతో ప్రభుత్వం ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించింది. పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు 4 కి.మీటర్ల పొడవు, 6 లేన్లతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సన్నద్ధమవుతోంది. పర్యావరణానికి ఎలాంటి హాని కలగకుండా, పార్క్ రూపురేఖలు మారకుండా ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు స్మార్ట్ ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్ల విస్తరణ, జంక్షన్ల అభివృద్ధి వంటి ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. ప్రభుత్వ తాజా నిర్ణయం పట్ల పర్యావరణ ప్రేమికులు, నగర వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సంపాదకీయం

## పూల చేతులు (కవిత)

అడవులు విధ్వంసం అయ్యాక...
తగలపడ్డాక..
ఇక్కడ నగరంలో మొలకెత్తుతున్నాయి..
తరలివచ్చిన వసంతాన్ని కాపు కాసి పెంచుతున్న
తోటమాలలు ఇక్కడ సిద్ధంగానే ఉన్నారు
విరగ కాస్తున్న పంట
కొత్త పండుగను మోసుకొస్తుంది
ఇక గుమ్మాలకు పచ్చటి తోరణాలు కట్టండి మంగళ
వాయిద్యాలు మ్రోగించండి ఇప్పుడు చేతిలో పూలు కూడా
అగ్నిపూలై ప్రశ్నల్ని గుమ్మరిస్తున్నాయి
కొత్త తరానికి కొత్త రాజకీయాలు ఇక అనివార్యం
తరం ఎప్పుడు ధ్వజమెత్తుతూనే ఉంటుంది తరం మారు-
ృను భళ్ళు న తెరుస్తూనే ఉంటుంది
ఎగిసి పడుతున్న అలల గర్జన వింటున్నారా
జైళ్ళను తోసుకుంటూ
స్వేచ్ఛ గల్లి అంతా పారుతుంది
గుండెల్ని తెరిచి ఆహ్వానిద్దాం
కూలుతున్న భ్రష్టత్వాన్ని తుడిచేసి
మరో ప్రపంచపు వా కి లి ముందు
రంగులు చల్లుకుందాం రండి...



తంగెళ్లపల్లి కనకాచారి
8790874028
హైదరాబాద్




## చదువు ఉంది.. అవకాశం ఎక్కడ?

చేతిలో డిగ్రీ.. కళ్లలో ఎన్నో కలలు.. కుటుంబం నుంచి ఎన్నో ఆశలు. కానీ చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగం కోసం ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వస్తే ఆ కలల పరిస్థితి ఏమవుతుంది? తెలంగాణలో వేలాది మంది యువత ఎదుర్కొంటున్న ప్రధాన ప్రశ్న ఇదే. ఉద్యోగ ప్రకటన వస్తుందేమోనని ఎదురుచూడటం.. నోటిఫికేషన్ వస్తే పరీక్షకు సిద్ధమవడం.. పరీక్ష వాయిదా పడితే మళ్లీ వేచి చూడటం.. ఫలితాల కోసం నెలల తరబడి ఎదురు చూడటం.. చివరకు ఉద్యోగం రాకపోతే మరో పరీక్ష కోసం సిద్ధం కావడం.. ఇలా యువతలో విలువైన సంవత్సరాలు గడిచిపోతున్నాయి. నిరుద్యోగం అంటే కేవలం జేబులో డబ్బు లేకపోవడం కాదు. అది ఒక యువకుడి ఆత్మవిశ్వాసాన్ని, కుటుంబంలో అతని స్థానాన్ని, భవిష్యత్తుపై ఉన్న నమ్మకాన్ని ప్రభావితం చేసే సమస్య. చదువుకున్న తర్వాత కూడా ఉద్యోగం రాకపోతే 'నేను ఏం చేయాలి?' అనే ప్రశ్న వెంటాడుతుంది. స్నేహితుల్లో కొందరికి ఉద్యోగాలు వస్తుంటే, తాను మాత్రం ఇంకా పోటీ పరీక్షల కోసం సిద్ధమవుతూ ఉంటే ఒత్తిడి మరింత పెరుగుతుంది. కుటుంబ సభ్యుల ప్రశ్నలు, బంధువుల వ్యాఖ్యలు, ఆర్థిక ఇబ్బందులు కలిసి నిరుద్యోగ యువతను మరింత నిరాశకు గురిచేస్తాయి. ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడే యువత పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారుతోంది. ప్రభుత్వ ఉద్యోగం భద్రత, స్థిరమైన ఆదాయం, సామాజిక గౌరవం ఇస్తుందనే భావనతో వేలాది మంది ఏళ్ల తరబడి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. కానీ ప్రభుత్వ ఉద్యోగాలు పరిమితమే. అందరూ ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరడం సాధ్యం కాదు. ప్రైవేట్ రంగంలో అవకాశాలు ఉన్నప్పటికీ అక్కడ అవసరమైన నైపుణ్యాలు, వేతన స్థాయిలు, ఉద్యోగ భద్రత వంటి అంశాలు యువతను వెనక్కి నెడుతున్నాయి. ఇక్కడ మరో సమస్య కూడా ఉంది. చదువు ఒకటి.. ఉద్యోగ మార్కెట్ కోరే నైపుణ్యం మరోటి. డిగ్రీ పూర్తయినప్పటికీ కంపెనీలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలు, కమ్యూనికేషన్, డిజిటల్ పరిజ్ఞానం, వృత్తిపరమైన శిక్షణ చాలామందికి ఉండకపోవచ్చు. మరోవైపు ఏ రంగంలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి? ఏ కోర్సు చేస్తే ఉపయోగం ఉంటుంది? ఏ నైపుణ్యం నేర్చుకోవాలి? ఎక్కడ శిక్షణ లభిస్తుంది? అనే సమాచారం కూడా గ్రామీణ యువతకు సకాలంలో అందడం లేదు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. ఒక యువకుడు శిక్షణ కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ప్రయాణ ఖర్చు, వసతి ఖర్చు భరించాలి. యువతులకు అయితే భద్రత, కుటుంబ బాధ్యతలు, ప్రయాణ సౌకర్యం వంటి అదనపు సమస్యలు ఎదురవుతాయి. అందుకే ఉపాధి, నైపుణ్య శిక్షణను పట్టణాలకే పరిమితం చేయకుండా మండల స్థాయిలోనే అందుబాటులోకి తీసుకురావాలి. నిరుద్యోగ యువతకు ఖాళీ సమయం కూడా ఒక ప్రమాదంగా మారే అవకాశం ఉంది. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూ ఫలితం కనిపించకపోతే కొందరు చెడు స్నేహాలు, వ్యసనాలు, ఆన్‌లైన్ మోసాలు లేదా ఇతర తప్పుదారుల వైపు వెళ్లే అవకాశం ఉంటుంది. అయితే ప్రతి నేరానికి నిరుద్యోగమే కారణమని చెప్పడం సరైంది కాదు. కుటుంబ పరిస్థితులు, ఆర్థిక ఒత్తిడి, వ్యక్తిగత సమస్యలు, సామాజిక వాతావరణం వంటి అనేక అంశాలు ఇందులో భాగం. కానీ స్థిరమైన ఉపాధి, సానుకూల వాతావరణం యువతకు దిశను చూపడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి, ఉపాధి మేళాలు, స్వయం ఉపాధి పథకాలు అమలు చేస్తున్నా.. వాటి విజయాన్ని శిక్షణ పొందిన వారి సంఖ్యతో మాత్రమే కొలవకూడదు. శిక్షణ తర్వాత ఎంతమందికి ఉద్యోగం వచ్చింది? ఎంతమంది స్వయం ఉపాధి ప్రారంభించారు? ఏడాది తర్వాత ఎంతమంది అదే రంగంలో కొనసాగుతున్నారు? అనే ప్రశ్నలకు సమాధానాలు ఉండాలి. అప్పుడే పథకాల అసలు ఫలితం తెలుస్తుంది. అలాగే కళాశాలలు కూడా తమ బాధ్యతను గుర్తించాలి. డిగ్రీ చివరి సంవత్సరం వచ్చే వరకు ఉద్యోగం గురించి ఆలోచించకుండా.. మొదటి నుంచే కెరీర్ మార్గదర్శకత్వం, నైపుణ్య శిక్షణ, పరిశ్రమల అవసరాలపై అవగాహన కల్పించాలి. పరిశ్రమలు ఏ నైపుణ్యాలను కోరుకుంటున్నాయో విద్యాసంస్థలకు తెలియజేయాలి. ప్రభుత్వం ప్రతి మండలంలో క్రమం తప్పకుండా ఉపాధి--నైపుణ్య శిబిరాలు నిర్వహించాలి. తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకమే. ఉద్యోగం రాలేదని యువతను నిందించడం కంటే వారికి తోడుగా నిలవాలి. ఒక పరీక్షలో విఫలమైతే జీవితం ముగిసినట్లు కాదని, ఒక ఉద్యోగం రాకపోతే మరో మార్గం వెతుక్కోవచ్చని ధైర్యం చెప్పాలి. చివరికి యువత కోరేది పెద్ద హామీలు కాదు.. తమ చదువుకు తగిన అవకాశం, తమ నైపుణ్యానికి తగిన పని, తమ శ్రమకు తగిన ఆదాయం. డిగ్రీ చేతిలో ఉండి అవకాశాల కోసం సంవత్సరాల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి మారాలి. ప్రభుత్వ ఉద్యోగం ఒక్కటే లక్ష్యంగా కాకుండా ప్రైవేట్ ఉద్యోగం, స్వయం ఉపాధి, స్టార్టప్‌లు, వృత్తి ఆధారిత అవకాశాలు కూడా యువతకు చేరువ కావాలి. యువత ఖాళీగా ఉండటం వారి వ్యక్తిగత వైఫల్యం కాదు.. అది సమాజం, విద్యా వ్యవస్థ, ఉపాధి మార్కెట్, ప్రభుత్వ విధానాల మధ్య ఉన్న అంతరానికి అద్దం. చదువు పూర్తయిన యువకుడి చేతిలో ఉద్యోగ దరఖాస్తు కాకుండా.. పని చేసే అవకాశం ఉన్న రోజే తెలంగాణ యువత భవిష్యత్తుకు నిజమైన భరోసా లభించిన రోజు.

# ఓటరు తీర్పుకు రక్షణ ఎక్కడ?

పార్టీ మారడం రాజకీయాల్లో కొత్తేమీ కాదు. కానీ ప్రజల ఓట్లతో ఒక పార్టీ అభ్యర్థిగా గెలిచి, అదే పదవిలో కొనసాగుతూ మరో పార్టీకి రాజకీయంగా దగ్గరవడం మాత్రం ప్రజాస్వామ్య వ్యవస్థలో తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతుంది. ప్రజలు ఒక అభ్యర్థిని ఎన్నుకున్నారా? లేక ఒక పార్టీకి ఇచ్చిన ఓటుతో ఆ అభ్యర్థిని అసెంబ్లీకి పంపించారా? ఈ ప్రశ్నకు సమాధానం వెతికితేనే ఫిరాయింపుల అసలు సమస్య అర్థమవుతుంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సంబంధించిన అనర్హత వ్యవహారం మరోసారి పదో షెడ్యూల్, స్పీకర్ అధికారాలు, న్యాయవ్యవస్థ జోక్యం, ప్రజా తీర్పు పరిరక్షణ వంటి అంశాలను చర్చలోకి తెచ్చింది. దానం నాగేందర్ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి గెలిచారు. ఎమ్మెల్యేగా కొనసాగుతూనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడం రాజకీయంగా పెద్ద వివాదానికి దారితీసింది. దీనిపై బీఆర్ఎస్ అనర్హత పిటిషన్ దాఖలు చేసింది. స్పీకర్ నిర్ణయం తర్వాత వ్యవహారం హైకోర్టుకు వెళ్లింది. హైకోర్టు స్పీకర్ నిర్ణయాన్ని రద్దు చేసి అనర్హతకు సంబంధించిన తీర్పు ఇవ్వగా, ఆ వ్యవహారం సుప్రీంకోర్టు వరకు వెళ్లింది. ఈ కేసు ద్వారా ఒక విషయం స్పష్టమైంది. ఫిరాయింపులపై నిర్ణయం తీసుకునే వ్యవస్థపై రాజకీయ వివాదాలు తలెత్తిన ప్రతిసారీ చివరకు న్యాయస్థానాలే ఆశ్రయంగా మారుతున్నాయి. ఇక్కడ అసలు ప్రశ్న ఒక వ్యక్తి అనర్హుడా? కాదా? అన్నది మాత్రమే కాదు. ఎన్నికల సమయంలో ప్రజలు ఇచ్చిన రాజకీయ తీర్పును ఎన్నికైన ప్రతినిధి తన వ్యక్తిగత రాజకీయ నిర్ణయంతో మార్చగలడా? అన్నదే కీలకం. ఒక పార్టీ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యే ఆ తర్వాత మరో పార్టీ వైపు వెళితే, అతనికి వ్యక్తిగతంగా రాజకీయ అభిప్రాయం మార్చుకునే స్వేచ్ఛ ఉండవచ్చు. కానీ ఆ మార్పుతో తనకు వచ్చిన ప్రజా పదవిని కూడా అదే విధంగా కొనసాగించే హక్కు ఉందా? ఇక్కడే వ్యక్తిగత రాజకీయ స్వేచ్ఛకు, ఓటరు తీర్పుకు మధ్య సంఘర్షణ మొదలవుతుంది. ఈ సమస్య కొత్తది కాదు. 1967లో హర్యానా ఎమ్మెల్యే గయాలాల్ వరుసగా పార్టీలు మారడంతో 'ఆయా రామ్.. గయా రామ్' అనే పదబంధం భారత రాజకీయాల్లో ఫిరాయింపులకు ప్రతీకగా మారింది. 1967 నుంచి 1971 మధ్య భారీ స్థాయిలో ఫిరాయింపులు జరగడం, ప్రభుత్వాలు కూలిపోవడం చివరకు రాజ్యాంగంలోనే ప్రత్యేక నిరోధక వ్యవస్థ అవసరాన్ని తీసుకొచ్చింది. ఫలితంగా 1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా పదో షెడ్యూల్ అమల్లోకి వచ్చింది. పదో షెడ్యూల్ ఉద్దేశం స్పష్టమే. పార్టీ టికెట్‌పై గెలిచిన సభ్యుడు స్వచ్ఛందంగా పార్టీ సభ్యత్వాన్ని వదిలినా, పార్టీ విప్‌కు వ్యతిరేకంగా ఓటు వేసినా లేదా కొన్ని పరిస్థితుల్లో ఓటింగ్‌కు దూరంగా ఉన్నా అనర్హతకు గురయ్యేలా నిబంధనలు రూపొందించారు. అయితే అనర్హతపై నిర్ణయం తీసుకునే అధికారాన్ని స్పీకర్ లేదా చైర్మన్‌కు అప్పగించడం వల్ల మరో సమస్య మొదలైంది. స్పీకర్ ఒక రాజ్యాంగ పదవిలో ఉన్నప్పటికీ సాధారణంగా ఒక రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తే. అందువల్ల ఆయన తీసుకునే నిర్ణయం ఎంతవరకు రాజకీయ ప్రభావాలకు అతీతంగా ఉంటుంది అన్న సందేహం తరచూ వ్యక్తమవుతోంది. అందుకే 2003లో 91వ రాజ్యాంగ సవరణ ద్వారా 'స్ప్లిట్' మినహాయింపును తొలగించి, విలీనం ద్వారా రక్షణ పొందాలంటే శాసనసభాపక్షంలో కనీసం మూడింట రెండొంతుల మంది సభ్యుల మద్దతు ఉండాలని నిబంధన తీసుకొచ్చారు. కానీ రాజకీయాలు చట్టంలోని ప్రతి నిబంధనకు కొత్త మార్గాలను వెతుక్కుంటూ వచ్చాయి. గుంపులుగా పార్టీ మారడం, విలీనాన్ని ఆశ్రయించడం, రాజీనామాలు చేయడం వంటి మార్గాలు రాజకీయ సమీకరణాలను మార్చడానికి ఉపయోగించబడ్డాయి. తెలంగాణ రాజకీయాల్లోనూ ఈ పరిణామాలు కనిపించాయి. ఒకప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పెద్ద సంఖ్యలో టీఆర్ఎస్‌లో విలీనమైనప్పుడు కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇప్పుడు అధికార సమీకరణం మారడంతో బీఆర్ఎస్ నుంచి ఎన్నికైన కొందరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వైపు వెళ్లినప్పుడు బీఆర్ఎస్ అదే ఫిరాయింపులపై అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఇక్కడ రాజకీయ పార్టీల వైఖరిలో కనిపించే ఈ మార్పే అసలు సమస్యను మరింత స్పష్టంగా చూపిస్తుంది. అధికారంలో ఉన్నప్పుడు ఒక న్యాయం, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో న్యాయం అనే రాజకీయ సంస్కృతి కొనసాగితే ఫిరాయింపుల నిరోధక చట్టం ఉద్దేశమే బలహీనపడుతుంది. అయితే చట్టపరంగా చూస్తే ప్రస్తుతం కూడా ఫిరాయింపులకు వ్యతిరేకంగా కొన్ని మార్గాలు ఉన్నాయి. పదో షెడ్యూల్ కింద అనర్హత పిటిషన్ దాఖలు చేయవచ్చు. స్పీకర్ నిర్ణయం తీసుకోవాలి. ఆ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధంగా, చట్టపరమైన ప్రమాణాలకు విరుద్ధంగా లేదా అనవసర ఆలస్యంతో ఉంటే న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా స్పీకర్ నిర్ణయం పూర్తిగా న్యాయ సమీక్షకు అతీతం కాదని సుప్రీంకోర్టు తీర్పులు స్పష్టం చేశాయి. అంటే స్పీకర్ తుది అధికారి అయినప్పటికీ ఆయన నిర్ణయం న్యాయపరిశీలనకు బయట ఉండదు. అయితే ఇక్కడే మరో పెద్ద లోపం బయటపడుతోంది. పిటిషన్ దాఖలైన తర్వాత ఎప్పుడు నిర్ణయం వస్తుంది? అన్నదానికి వ్యవస్థలో స్పష్టమైన, కఠినమైన కాలపరిమితి లేకపోవడం. ఒక ఎమ్మెల్యేపై అనర్హత పిటిషన్ పెండింగ్‌లో ఉండగానే ఆయన సభలో కొనసాగితే, ప్రభుత్వ బలం మారవచ్చు. ఒక ఓటు కీలకమైన సందర్భంలో ఆయన ఓటు వేయవచ్చు. ఆ తర్వాత సంవత్సరాల తరువాత అనర్హత తేలినా అప్పటికే రాజకీయ పరిణామాలు జరిగిపోయి ఉండవచ్చు. అప్పుడు ఆలస్యంగా వచ్చిన న్యాయం ప్రజా తీర్పును ఎంతవరకు పునరుద్ధరించగలదు అన్నది ప్రశ్న. ఇదే కారణంగా సుప్రీంకోర్టు కూడా స్పీకర్ లేదా చైర్మన్‌కు మాత్రమే ఈ అధికారాన్ని అప్పగించే ప్రస్తుత విధానంపై పార్లమెంట్ ఆలోచించాల్సిన అవసరాన్ని ప్రస్తావించింది. స్వతంత్ర శాశ్వత ట్రిబ్యునల్ లేదా ఇతర స్వతంత్ర నిర్ణయ యంత్రాంగం ద్వారా ఫిరాయింపుల కేసులను పరిష్కరించే అవకాశాన్ని పరిశీలించాలని కోర్టు గతంలో సూచించింది. అలాగే అనర్హత పిటిషన్లను నిరవధికంగా పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాల్సిన అవసరాన్ని కూడా గుర్తించింది. ఇది కేవలం తెలంగాణకు సంబంధించిన సమస్య కాదు. కర్ణాటకలో ఎమ్మెల్యేల రాజీనామాలు, మధ్యప్రదేశ్‌లో ఎమ్మెల్యేల పార్టీ మార్పులు, అరుణాచల్‌ప్రదేశ్‌లో పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేల రాజకీయ మార్పులు వంటి పరిణామాలు దేశవ్యాప్తంగా ఒకే ప్రశ్నను ముందుకు తెచ్చాయి. పదో షెడ్యూల్ ఉన్నప్పటికీ పార్టీ మార్పులను పూర్తిగా అడ్డుకోలేకపోతే చట్టంలో ఉన్న లోపం ఎక్కడుంది? చట్టంలోనా? అమలులోనా? లేక రాజకీయ వ్యవస్థలోనా? ఇక్కడ ఒక ముఖ్యమైన చట్టపరమైన తేడాను కూడా గుర్తించాలి. పార్టీ మారడం, ఎమ్మెల్యే పదవిని కోల్పోవడం రెండూ ఎప్పుడూ ఒకటే కాదు. పదో షెడ్యూల్‌లోని పరిస్థితులు వర్తిస్తే అనర్హత సమస్య వస్తుంది. మరోవైపు ఎమ్మెల్యే స్వచ్ఛందంగా రాజీనామా చేసి, ఆ తర్వాత మరో పార్టీ నుంచి పోటీ చేయడం వంటి పరిణామాలు వేరే రాజ్యాంగ, ఎన్నికల ప్రశ్నలను లేవనెత్తుతాయి. అందువల్ల ప్రతి పార్టీ మార్పును ఒకే చట్టపరమైన ప్రమాణంతో చూడటం కూడా సరైనది కాదు. మరి ముందున్న పరిష్కారం ఏమిటి? మొదటగా అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడానికి స్పష్టమైన గడువు ఉండాలి. రెండోది, స్పీకర్ అధికారాన్ని పూర్తిగా తొలగించాలా లేదా స్వతంత్ర యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలా అన్నదానిపై పార్లమెంట్ సమగ్ర చర్చ జరపాలి. మూడోది, పార్టీ మార్పు వల్ల సభా బలం కృత్రిమంగా మారకుండా రాజీనామాల వ్యవస్థను కూడా కఠినంగా పరిశీలించాలి. నాలుగోది, ఎన్నికల్లో ఒక పార్టీ గుర్తుపై ప్రజల నుంచి పొందిన మాండేట్‌ను మరో పార్టీకి బదిలీ చేసే పరిస్థితులకు ప్రజాస్వామ్యపరమైన పరిమితులు ఉండాలి. అయితే మరోవైపు ప్రజాప్రతినిధికి తన రాజకీయ అభిప్రాయాన్ని మార్చుకునే స్వేచ్ఛను పూర్తిగా హరించడం కూడా ప్రజాస్వామ్యానికి అనుకూలం కాదు. ఒక పార్టీ నాయకత్వం తప్పు చేస్తోందని భావించిన ఎమ్మెల్యే జీవితాంతం అదే పార్టీలోనే ఉండాలని బలవంతం చేయడం కూడా సరైన ప్రజాస్వామ్య సూత్రం కాదు. కాబట్టి పరిష్కారం వ్యక్తిగత రాజకీయ స్వేచ్ఛను తొలగించడం కాదు. పార్టీ మారాలనుకుంటే పదవికి సంబంధించి ప్రజల తీర్పును తిరిగి పొందే విధానం ఉండేలా వ్యవస్థను రూపొందించడం కావచ్చు. అందుకే ఫిరాయింపులపై చర్చను 'ఈ ఎమ్మెల్యే ఎవరి వైపు వెళ్లారు?' అనే రాజకీయ లెక్కలకే పరిమితం చేయకూడదు. ఈరోజు ఒక పార్టీకి అనుకూలంగా ఉన్న నిబంధన రేపు మరో పార్టీకి వ్యతిరేకంగా మారవచ్చు. కానీ ఓటరు మాత్రం ప్రతి ఎన్నికలో తన ఓటుతో ఒక నిర్ణయం తీసుకుంటాడు. ఆ నిర్ణయం మధ్యలో రాజకీయ మార్పులతో అర్థం కోల్పోతే ఎన్నికల వ్యవస్థపై ప్రజల నమ్మకం దెబ్బతింటుంది. దానం నాగేందర్ వ్యవహారం కూడా అందుకే ఒక వ్యక్తి లేదా ఒక పార్టీకి సంబంధించిన కేసుగా చూడకూడదు. ఇది భారత ప్రజాస్వామ్యంలో ఫిరాయింపుల నిరోధక చట్టం ఎంతవరకు పనిచేస్తోంది? స్పీకర్ వ్యవస్థ సరిపోతుందా? అనర్హతపై నిర్ణయం ఆలస్యమైతే దాని ప్రయోజనం ఏమిటి? ప్రజల తీర్పును రక్షించడానికి మరింత బలమైన వ్యవస్థ అవసరమా? అనే ప్రశ్నలను ముందుకు తెచ్చిన సందర్భం. చివరికి రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకే ప్రమాణాన్ని పాటించే పరిస్థితి రావాలి. ఫిరాయింపుల చట్టం ఎవరి మీద అమలు అవుతుంది అన్నది కాదు.. ఎవరైనా పార్టీ మారినా ప్రజా తీర్పు ఎలా రక్షించబడుతుంది అన్నదే అసలు ప్రశ్న. ఈ విషయంలో పార్లమెంట్ స్పష్టమైన కాలపరిమితి, స్వతంత్ర నిర్ణయ వ్యవస్థ, న్యాయ సమీక్షకు అనుకూలమైన విధానం వంటి అంశాలపై దీర్ఘకాలిక సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. లేకపోతే ఎన్నికల ముందు ప్రజల తీర్పు ఒకటిగా, ఎన్నికల తర్వాత రాజకీయ సమీకరణాల ఆధారంగా ప్రభుత్వ బలం మరోలా మారే పరిస్థితి కొనసాగుతూనే ఉంటుంది.

# మారాల్సింది వ్యవస్థే



తెలంగాణలో అవినీతిపై ఏసీబీ దాడులు వరుసగా జరుగుతున్నాయి. లంచం తీసుకుంటూ పట్టుబడుతున్న అధికారులు ఒకవైపు ఉంటే.. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో కోట్ల రూపాయల ఆస్తులు బయటపడుతున్న ఘటనలు మరోవైపు కనిపిస్తున్నాయి. తాజాగా ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం డిమాండ్, స్వీకరణకు సంబంధించిన పలు కేసులు వెలుగులోకి రావడం చూస్తే.. అవినీతి ఇంకా పరిపాలనా వ్యవస్థకు పెద్ద సవాలుగానే ఉందని అర్థమవుతోంది. అయితే ఏసీబీ దాడులు పెరగడం ఒక్క కోణం మాత్రమే. దీనిని మరో కోణంలోనూ చూడాలి. కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయంటే అవినీతి పెరిగిందని మాత్రమే కాదు.. ఫిర్యాదులపై ఏసీబీ స్పందన, నిఘా, ట్రాప్ ఆపరేషన్లు కూడా వేగం పుంజుకున్నాయని అర్థం. ప్రజల్లో కూడా లంచం అడిగినప్పుడు ఫిర్యాదు చేయాలనే అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది. అయితే అసలు ప్రశ్న ఏసీబీ ఎంతమందిని పట్టుకుంది? అనేది కాదు. పట్టుబడిన తర్వాత మళ్లీ అదే తరహా అవినీతి జరగకుండా వ్యవస్థలో ఏ మార్పు వచ్చింది? అన్నదే. ఒక ఉద్యోగి లంచం తీసుకుంటూ పట్టుబడటం ఒక చర్య మాత్రమే. కానీ ఆ లంచానికి కారణమైన విధానపరమైన లోపాలు అలాగే ఉంటే మరో వ్యక్తి అదే స్థానాన్ని భర్తీ చేసి అదే పని చేసే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా భూ వ్యవహారాలు, నిర్మాణ అనుమతులు, టౌన్ ప్లానింగ్, రిజిస్ట్రేషన్లు, వైద్య సేవలు, పోలీస్ విభాగం వంటి ప్రజలతో నేరుగా సంబంధం ఉన్న శాఖల్లో పారదర్శకత మరింత అవసరం. ఫైల్ కదలాలంటే డబ్బు, అనుమతి రావాలంటే డబ్బు, పని పూర్తవ్వాలంటే డబ్బు అనే పరిస్థితి ఎక్కడైనా ఉంటే.. అక్కడ వ్యక్తులను పట్టుకోవడంతో పాటు వ్యవస్థను కూడా సరిచేయాలి. ఇక ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు మరింత తీవ్రమైన అంశం. లంచంగా వచ్చిన డబ్బు చివరకు భూములు, ఇళ్లు, ఫ్లాట్లు, వాహనాలు, వ్యాపార పెట్టుబడుల రూపంలోకి మారుతున్నట్లయితే.. ఆ డబ్బు ప్రవాహాన్ని గుర్తించడం కీలకం. ఒక అధికారి ఆదాయానికి, ఆస్తులకు మధ్య భారీ వ్యత్యాసం ఉంటే దానిపై ముందస్తు నిఘా ఉండాలి. రిజిస్ట్రేషన్, బ్యాంకింగ్, ఆదాయపు పన్ను, కంపెనీలకు సంబంధించిన చట్టబద్ధమైన సమాచారాన్ని సమన్వయం చేసి అనుమానాస్పద ఆస్తులపై దర్యాప్తు చేసే వ్యవస్థ బలపడాలి. అయితే ఏసీబీ దాడి అంటే నేరం రుజువైనట్లు కాదు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి చట్టపరమైన హక్కులు ఉంటాయి. దర్యాప్తు పూర్తయి, న్యాయస్థానంలో నేరం నిరూపితమైన తర్వాతే తుది నిర్ణయం ఉంటుంది. అందువల్ల ఏసీబీ చర్యలతో పాటు న్యాయ ప్రక్రియ కూడా వేగంగా, పారదర్శకంగా సాగాలి. అవినీతి నిరోధక పోరాటానికి అసలు పరీక్ష కేసుల సంఖ్య కాదు. కేసులు నమోదైన తర్వాత ఎంత వేగంగా దర్యాప్తు పూర్తవుతోంది? ఎప్పుడు ఛార్జ్‌షీట్ దాఖలవుతోంది? కోర్టుల్లో ఎప్పుడు తీర్పు వస్తోంది? అక్రమ ఆస్తులపై చివరకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? అనేదే ముఖ్యం. చివరికి తెలంగాణలో అవినీతిని తగ్గించాలంటే ఏసీబీ కొరడా ఒక్కటే సరిపోదు. డిజిటల్ సేవలు, ఫైల్ ట్రాకింగ్, పారదర్శక అనుమతుల విధానం, అధికారులపై పర్యవేక్షణ, వేగవంతమైన న్యాయ ప్రక్రియ-ఇవన్నీ కలిసి పనిచేయాలి. అధికారులను పట్టుకోవడం అవసరం.. కానీ అవినీతికి అవకాశం ఇచ్చే వ్యవస్థను మార్చడం అంతకంటే అవసరం. సామాన్యుడి పని లంచం లేకుండా జరిగే రోజే అవినీతి వ్యతిరేక పోరాటానికి నిజమైన విజయంగా భావించాలి.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# పార్టీ డబ్బులు మాయం..

## ఆఫీసు బేరర్ల సమావేశంలో నేతలకు వార్నింగ్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఇలా పనిచేస్తే రాష్ట్రంలో ఏ విధంగా అధికారంలోకి వస్తామని బీజేపీ రాష్ట్ర సహ ఇన్‌చార్జి అభయ్‌పాటిల్ తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం పార్టీ చీఫ్ రాంచందర్‌రావు అధ్యక్షతన రాష్ట్ర పదాధికారుల సమావేశం జరిగింది. సమావేశానికి రాష్ట్ర సహ ప్రభారీ అభయ్ పాటిల్, పార్టీ నూతన సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి మధుకర్ తదితరులుహాజరయ్యారు. ఈ సందర్భంగా పాటిల్ మాట్లాడుతూ.. గత మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల ఖర్చులకు అవస రమనే ఉద్దేశంతో పార్టీ పంపించిన డబ్బును వారికి ఇవ్వకుండా, పార్టీ ప్రచారానికి ఖర్చు చేయకుండా కాజేయడం ఏంటని నిలదీశారు. పార్టీ డబ్బులు తిన్న ఎవరినీ వదిలే ప్రసక్తే లేదని, వారు ఎవరనేది ఇప్పటికే గుర్తించామని, వారు వెంటనే ఆ డబ్బును వెనక్కి ఇచ్చేయాలని, లేదంటే క్రిమినల్ కేసులు పెడుతామని హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థులకు డబ్బులు ఇవ్వకుండా వాడుకున్న వారిపైనా అవసరమైతే కేసు పెట్టించి జైల్లో వేయిస్తాననని జిల్లా అధ్యక్షులను హెచ్చరించారు. ఫొటోలకు ఫోజులు ఇవ్వడం.. పనిచేసినట్లుగా చెప్పుకోవడం కాదని, క్షేత్ర స్థాయిలో తిరగాలని స్పష్టం చేశారు. 'నేను ఇక్కడ ఇన్నాళ్లు తాత్కాలికం అని కొందరు అనుకున్నారు.. నేను ఎప్పుడు పోతానా? అని చూశారు.. కానీ ఇప్పుడు పార్టీ అధికారికంగా ప్రకటించింది.. నేను ఎక్కడికి పోను.. ఇక్కడే ఉంటా..' అని స్పష్టం చేశారు. మధుకర్ మాట్లాడుతూ.. పదవులు తీసుకొని ఏసీ రూ-మ్‌లో ఉంటే సరిపోదని, క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందేనని స్పష్టం చేసినట్లుగా తెలిసింది. అలాగే పార్టీలో క్రియాశీలక సభ్యత్వం లేని 30 మందికి పదవులు ఎలా ఇచ్చారంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా మీటింగులో ఫోన్ మాట్లాడిన ఓ నేతను బయటకు పంపించినట్లుగా తెలిసింది.

**ఇన్‌చార్జిలనూ పిలవాల్సింది...**

సమావేశం అనంతరం కొంతమంది జిల్లా అధ్యక్షులతో అభయ్‌పాటిల్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అయితే తమతోపాటు మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జిలను కూడా మీటింగ్‌కు పిలిచి ఉండి ఉంటే బాగుండేదని, డబ్బుల పంపిణీలో తమ పాత్రతోపాటుగా వారి పాత్ర కూడా ఉందని, వారు కూడా కొంత కాజేశారని కొందరు జిల్లా అధ్యక్షులు పాటిల్‌కు చెప్పినట్లుగా తెలిసింది. పార్టీ కార్యాలయాల నిర్వహణకు తమకు నెలకు కొంత మొత్తాన్ని ఇవ్వాలని, తాము వాటిని భరించలేకపోతున్నామని కోరినట్టు తెలిసింది. వారి వినతిపై నేతలు సానుకూలంగా స్పందించారని సమాచారం. ఈ సమావేశంతో నాయకులు ఒక్కసారిగా అలర్ట్ అయ్యారు. ఇప్పటివరకు చాలా ఆఫీసు బెరర్ సమావేశాలు జరిగాయని, కానీ ఇంత సీరియస్ మీటింగ్ ఎప్పుడూ జరగలేదని పార్టీ నాయకులు వెల్లడించారు. ఇన్నాళ్లు తమకు రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వస్తుంది అంటే ఏదో అనుకున్నామని, ప్రతిసారి అంటూనే ఉంటారని కానీ ఈసారి సీరియస్‌నెస్ చూశాక, ఇకపై కూడా ఇంతే సీరియస్‌నెస్‌ను మెయింటేన్ చేస్తే ఖచ్చితంగా అధికారంలోకి వస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశాన్ని శుభపరిణామంగా అభివర్ణించారు.

**ఆ తర్వాతే ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్ల ఖరారు...**

రాబోయే ఎమ్మెల్సీ, మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలను ఎదుర్కొనేందుకు బూత్ స్థాయి నుంచే పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తున్నామని బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్‌రావు స్పష్టం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఓటర్ల నమోదును బూత్ స్థాయిలో వేగవంతం చేశామని, ఎన్నికల నిర్వహణ, అభిప్రాయ సేకరణ కమిటీల నివేదిక, అంతర్గత చర్చల ఆధారంగా అభ్యర్థుల జాబితాను త్వరలోనే కేంద్ర నాయకత్వ ఆమోదానికి పంపి ప్రకటించనున్నట్లు వెల్లడించారు. గతంలో కేసీఆర్ కుటుంబం, ఇప్పుడు రేవంత్ బ్రదర్స్ బాగుపడుతున్నారు తప్పితే తెలంగాణ ప్రజలు మాత్రం బాగుపడడం లేదని పేర్కొన్నారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవు కానీ, ఢిల్లీకి మూటలు పంపడానికి ఉన్నాయా? అని నిలదీశారు. ప్రధాని మోడీ జన్మదినం సందర్భంగా అనేక సేవా సంకల్ప కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. రేపు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలో సేవా జ్యోతి యాత్ర, 'వికసిత్ భారత్ సంకల్ప సభ' నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.



# 5 రోజులే పని అమలు చేయండి..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బ్యాంక్ ఉద్యోగుల డిమాండ్‌పై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వారానికి ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బ్యాంకు ఉద్యోగులు చేస్తున్న డిమాండ్ న్యాయబద్ధమైనదేనని, అధిక పనిభారంతో సతమతమవుతున్న బ్యాంకు ఉద్యోగులు ఐదు రోజుల పని దినాల డిమాండ్ అమలు కోసం ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ వీడియో రిలీజ్ చేసిన కవిత.. ఉదయం బ్యాంకులు తెరిచినప్పటి నుంచి కస్టమర్లను డీల్ చేయడంతో పాటు, బ్యాక్ ఎండ్ వర్క్, టార్గెట్లు, కరెన్సీ లెక్కలు చూసుకోవడంలో రోజంతా గడిచిపోతుందన్నారు. చాలా మంది బ్యాంకు ఉద్యోగులకు పని ఏమీ ఉండదనే అభిప్రాయంతో ఉన్నారని కానీ బ్యాంక్ బిజినెస్ అవర్స్ ముగిసిన తర్వాత కూడా ఉద్యోగులు బ్యాంకుల్లోనే ఉంటూ చాలామంది ఉద్యోగులు రాత్రి తొమ్మిది, పది గంటల వరకు కూడా పని చేయాల్సి వస్తుందన్నారు.

**ప్రత్యామ్నాయంగా షిఫ్ట్ విధానం తీసుకురండి:**

ఇటీవల బ్యాంకింగ్ రంగంలో అనేక మా-ర్పులు చోటు చేసుకున్నాయని ముఖ్యంగా గత పదేళ్లలో డిజిటల్ బ్యాంకింగ్, యూపీఐ లావాదేవీలు గణనీయంగా పెరగడం, ఏటీఎంలు అందుబాటులోకి రావడంతో ఖాతాదారులు శాఖలకు రావడం తగ్గిందని కవిత చెప్పారు. అయినప్పటికీ బ్యాంకు ఉద్యోగుల పనిభారం మాత్రం తగ్గడం లేదని అందువల్ల వారానికి ఐదు రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇది సాధ్యం కాని పక్షంలో బ్యాంకులు వారానికి ఏడు రోజులు రన్ చేస్తూ ప్రత్యామ్నాయంగా ఉద్యోగులకు షిఫ్ట్ విధానం తీసుకురావాలన్నారు. ప్రభుత్వం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న వారానికి రెండు శనివారాలు సెలవులు కొనసాగుతున్నా ఎక్కడా ప్రొడక్టివిటీ తగ్గలేదని చెప్పారు.

# పరీక్షించిన తరువాతే

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ నగరంలో తాగునీటి నాణ్యతకు సంబంధించి ఇటీవల ప్రచారంలోకి వచ్చిన ఒక వీడియో/సర్వేలో పరీక్షించిన నీటి నమూనాలు భూగర్భజల వనరులకు సంబంధించినవేనని, అవి జలమండలి శుద్ధి చేసి నల్లాల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటి నమూనాలు కావని జలమండలి స్పష్టం చేసింది. భూగర్భజలాలపై నిర్వహించిన పరీక్షల ఫలితాలను జలమండలి సరఫరా చేసే శుద్ధి చేసిన తాగునీటికి అన్వయించడం సరికాదని పేర్కొంది. భూగర్భజల నాణ్యత ప్రాంతాన్ని బట్టి మారుతూ ఉంటుంది. సహజ భౌగోళిక పరిస్థితులు, స్థానిక పరిసరాల కారణంగా కొన్ని ప్రాంతాల్లో టీడీఎస్, హార్డ్‌నెస్, ఫ్లోరైడ్, నైట్రేట్ తదితర పారామీటర్లు తాగునీటికి నిర్దేశించిన ప్రమాణాలకు భిన్నంగా ఉండే అవకాశం ఉంది.

**రోజుకు 560 ఎంజీడీ నీటి శుద్ధి**

జలమండలి వివిధ జలవనరుల నుంచి సేకరిస్తున్న రోజుకు సుమారు 560 ఎంజీడీ నీటిని శుద్ధి కేంద్రాల్లో నిర్దేశిత తాగునీటి ప్రమాణాలకు అనుగుణంగా శుద్ధి చేసిన అనంతరమే సరఫరా చేస్తోంది. నీటి వనరుల నుంచి శుద్ధి కేంద్రాలు, మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, సర్వీస్ రిజర్వాయర్లు, పంపిణీ వ్యవస్థ మీదుగా నల్లా వరకు ప్రతి దశలో నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షిస్తోంది.

**రోజూ 5,500 నమూనాల పరీక్షలు**

జలమండలి క్వాలిటీ అస్యూరెన్స్ అండ్ టెస్టింగ్ (క్యూఏటీ) విభాగం, ఓ అండ్ ఎం సిబ్బంది, లైన్‌మెన్లు, థర్డ్ పార్టీ సంస్థల ద్వారా నీటి సరఫరా సమయంలోనే రోజుకు సుమా-రు 5,500 నీటి నమూనాలపై నాణ్యత పరీక్షలు, పర్యవేక్షణ జరుగుతోంది. ముఖ్యంగా టెయిల్ ఎండ్ ప్రాంతాలు, మురికివాడలు, లోతట్టు ప్రాంతాలు, కాలుష్యానికి అవకాశం ఉన్న ప్రాంతాలు, సర్వీస్ రిజర్వాయర్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పరీక్షల్లో ప్రతికూల ఫలితం నమోదైతే వెంటనే కారణాలను గుర్తించి దిద్దుబాటు చర్యలు చేపడుతున్నారు.

**ప్రత్యేక ప్రయోగశాలలు**

తాగునీటి నాణ్యత పర్యవేక్షణ కోసం జలమండలిలో 1992 నుంచి క్వాలిటీ అస్యూరెన్స్ అండ్ టెస్టింగ్ (క్యూఏటీ) విభాగం ప్రత్యేకంగా పనిచేస్తోంది. ఆసిఫ్‌నగర్ ఫిల్టర్ బెడ్స్‌లో ఎన్‌ఏబీఎల్ గుర్తింపు పొందిన కేంద్ర ప్రయోగశాలతో పాటు మీరాలం, సికింద్రాబాద్ కంట్రోల్ రూమ్, హైదర్‌నగర్, సాహెబ్‌నగర్, రాజంపేట, పెద్దాపూర్ ప్రాంతాల్లో ప్రత్యేక ప్రయోగశాలలు పనిచేస-్తున్నాయి. తాగునీటిలో పీహెచ్, రంగు, వాసన, టర్బిడిటీ, ఆల్కలినిటీ, హార్డ్‌నెస్, టీడీఎస్, నైట్రేట్, ఫ్లోరైడ్, క్లోరైడ్, సల్ఫేట్, ఐరన్, మాంగనీస్, అవశేష క్లోరిన్ తదితర భౌతిక--రసాయన పారామీటర్లను ఐఎస్ 10500:2012 ప్రమాణాలకు అనుగుణంగా పరీక్షిస్తున్నారు. టోటల్ కోలిఫామ్, ఈ-కోలి వంటి బ్యాక్టీరియా ఉనికిని గుర్తించేందుకు బ్యాక్టీరియాలజికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. తాగునీటి భద్రతలో కీలకమైన క్లోరినేషన్ ప్రక్రియను జలమండలి మూడు దశల్లో నిర్వహిస్తోంది. ముడి నీరు శుద్ధి కేంద్రానికి చేరినప్పుడు ప్రీ-క్లోరినేషన్, శుద్ధి అనంతరం పోస్ట్-క్లోరినేషన్, సర్వీస్ రిజర్వాయర్ల వద్ద బూస్టర్ క్లోరినేషన్ చేపడుతోంది.

**'నాణ్యత' యాప్‌తో రియల్‌టైమ్ పర్యవేక్షణ**

నీటి నాణ్యత పరీక్షల్లో పారదర్శకత, వేగం పెంచేందుకు జలమండలి 'నాణ్యత' మొబైల్ యాప్‌ను వినియోగిస్తోంది. శాంపిల్ టేకర్లు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ ఎం) సిబ్బంది క్షేత్రస్థాయిలో నిర్వహించే అవశేష క్లోరిన్ పరీక్షల వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేస్తున్నారు. భూగర్భజల నాణ్యత ప్రాంతాన్నిబట్టి మారుతుందని, అందువల్ల బోరు నీటిని నేరుగా తాగునీటిగా వినియోగించే ముందు దాని నాణ్యతను పరీక్షించుకోవాలని జలమండలి ఎండీ కె.అశోక్ రెడ్డి సూచించారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన తాగునీటిని అందించడమే జలమండలి లక్ష్యమన్నారు.

# ఇక చాలు బ్రో, రాజీనామా చెయ్

**ఢిల్లీ :** ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ, ఓట్ల తొలగింపు వ్యవహారంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్ష కూటమి ఎంపీలు దేశ రాజధానిలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎస్పీ, టీఎంసీ సహా కూటమి పార్టీల కీలక ఎంపీలందరూ పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్ నుంచి కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం వైపు ర్యాలీగా బయలుదేరారు. అయితే, పార్లమెంట్ స్ట్రీట్‌లోని నీతి ఆయోగ్ భవన్ - ఆకాశవాణి భవన్ మధ్యలో ఢిల్లీ పోలీసులు పటిష్ట బారికేడ్లతో ఈ ర్యాలీని అడ్డుకున్నారు. ముందుకు వెళ్లేందుకు అనుమతి నిరాకరించడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపీలంతా రోడ్డుపైనే బైఠాయించి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం వైఖరికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. "జ్ఞానేశ్, ఆట ముగిసింది బ్రో.. ఇక రాజీనామా చేయాల్సిన సమయం వచ్చింది" అంటూ సీఈసీపై తీవ్రమైన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘం అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థలను ఖూనీ చేస్తోందని, పారదర్శకతను తుంగలో తొక్కిన జ్ఞానేశ్ కుమార్ ఆ కుర్చీలో కొనసాగే నైతిక హక్కును కోల్పోయారని మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. సీఈసీ వైదొలిగేంత వరకు దేశవ్యాప్తంగా తమ పోరాటం ఆగదని, అక్టోబర్ 8 వరకు జిల్లా స్థాయిల్లో పాదయాత్రలు, ఆందోళనలు కొనసాగిస్తామని విపక్ష నేతలు స్పష్టం చేశారు. విపక్ష ఎంపీల ధర్నాతో పార్లమెంట్ పరిసరాల్లో భారీగా భద్రతా బలగాలను మోహరించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

**'సర్' ప్రక్రియ ఆపాలి: ఎంపీ చామల**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని, 'సర్' ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ పేరుతో అనేక రాష్ట్రాలలో లక్షల ఓట్లను తొలగించారని ఆరోపించారు. పార్లమెంట్ మకర ద్వారా నుంచి కేంద్ర ఎన్నికల సంఘం వరకు ర్యాలీగా వెళ్తామని.. ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి పత్రాన్ని అందజేస్తామని చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి మంత్రి అమిత్ షా తమ చెప్పుచేతల్లో పెట్టుకుంటున్నారని ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఇద్దరూ కూడా ఖూనీ చేసే ప్రయత్నం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. పార్లమెంట్ నుంచి ఈసీ వరకు వెళ్లకుండా ఎంపీల హక్కులను కాలరాస్తున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపణలు గుప్పించారు. కాగా.. కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ఇండియా కూటమి ఎంపీలంతా ఆందోళన చేయనున్నారు. ఇప్పటికే పార్లమెంట్ మకరద్వారానికి ఇండియా కూటమి ఎంపీలు చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా ఎన్నికల సంఘం కార్యాలయంవైపు పాదయాత్రగా వెళ్లాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులు మోహరించారు.



# బోగస్ ఫారం-7 పత్రాల కలకలం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణాలో కొనసాగుతున్న ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో పెద్ద ఎత్తున బోగస్ ఫారం-7 పత్రాలు వెలుగుచూస్తుండటం తీవ్రదుమారం రేపుతోంది. నిబంధనల ప్రకారం ఎవరైనా వ్యక్తి మరణించినా లేదా ఇతర ప్రాంతానికి మారినా వారి కుటుంబ సభ్యులు ఫారం-7 సమర్పించాల్సి ఉంటుంది. అయితే, నిబంధనలకు విరుద్ధంగా ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని 210 పోలింగ్ కేంద్రంలో 31 మంది ఓటర్ల పేర్లను తొలగించేందుకు నకిలీ పత్రాలు సిద్ధం చేయడం ఇప్పుడు కలకలం సృష్టించింది. ఈ వ్యవహారంలో బూత్ లెవల్ ఏజెంట్ బాలచందర్ అనే వ్యక్తి బోగస్ ఫారం-7 పత్రాలను సమర్పించేందుకు యత్నించినట్లు ఆరోపణలు రావడంతో ముషీరాబాద్ ఈఆర్వో (ఓటరు నమోదు అధికారి) ప్రవీణ్‌కుమార్‌రెడ్డి స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. దీనితో పోలీసులు విచారణ చేపట్టనున్నారు. మ-రోవైపు, బీఎల్ఏలకు బీజేపీ పార్టీనే ఈ నకిలీ పత్రాలను అందించిందని కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ఈ అక్రమాలపై పూర్తిస్థాయి దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలంటూ నగర పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు అందింది. పలు నియోజకవర్గాల్లో బోగస్ పత్రాలు బయటపడుతున్న నేపథ్యంలో.. రాష్ట్ర ఎన్నికల అధికారి అప్రమత్తమై జిల్లా అధికారులను హెచ్చరించడంతో 'సర్' ప్రక్రియలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి.

# సింథటిక్ డ్రగ్స్‌పై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో సింథటిక్ డ్రగ్స్, రసాయనాల అక్రమ తయారీ, రవాణాపై ఈగల్ ఫోర్స్ మరింత కఠిన చర్యలకు సిద్ధమైంది. డ్రగ్స్ తయారీకి ఉపయోగించే రసాయనాలు, పరికరాలపై నిఘాను పెంచడంతో పాటు ఫార్మా, కెమికల్ పరిశ్రమల రియాక్టర్ల లీజింగ్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించింది. డ్రగ్స్ తయారీకి రియాక్టర్లను అద్దెకు ఇచ్చే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈగల్ ఫోర్స్ నిర్ణయించింది. డ్రగ్స్ తయారీకి రియాక్టర్లను వినియోగిస్తున్నట్లు తేలితే సంబంధిత సంస్థల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకునేలా నిఘా వ్యవస్థను పటిష్ఠం చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 80కి పైగా పరిశ్రమల్లో ఈగల్ ఫోర్స్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో పలు రసాయనాల నిల్వలు, వినియోగంపై వివరాలను పరిశీలించింది. తైవాన్‌కు ఏసీ కంప్రెసర్ ఆయిల్ పేరుతో తరలిస్తున్న ప్రొపోఫోల్‌ను అధికారులు పట్టుకున్నట్లు వెల్లడైంది. అదేవిధంగా 200 కిలోలకు పైగా అసిటిక్ అన్‌హైడ్రైడ్ నిల్వల్లో తేడాలను అధికారులు గుర్తించారు. డ్రగ్స్ తయారీలో ఉపయోగించే రసాయనాలు అక్రమంగా పక్కదారి పట్టకుండా పరిశ్రమల నుంచి వాటి నిల్వలు, వినియోగం వరకు పర్యవేక్షించాలని నిర్ణయించారు. పౌల్ట్రీ ఫారాలు, పాడుబడిన ఇళ్లు, నిర్మానుష్య ప్రాంతాల్లో రహస్యంగా సింథటిక్ డ్రగ్స్ త-యారు చేసే అవకాశాలపై కూడా ఈగల్ ఫోర్స్ ప్రత్యేక దృష్టి పెట్టింది. మరోవైపు నిషేధిత సిగరెట్ల విక్రయాల మూలాలను గుర్తించి వాటి సరఫరా వ్యవస్థపై కూడా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. డ్రగ్స్ రవాణాకు ఉపయోగించే మార్గాలపైనా నిఘా పెంచుతున్నారు. వి ట్రాన్స్, విఆర్ఎల్, రాపిడో, పోర్టర్ వంటి రవాణా సంస్థల ద్వారా డ్రగ్స్ తరలించే అవకాశాలను పరిశీలిస్తున్నారు. కొరియర్ సంస్థలు పార్శిళ్లకు సంబంధించిన ఇన్‌వాయిస్, ఈ-వే బిల్లులను తప్పనిసరిగా నమోదు చేయాలని అధికారులు సూచించారు. పార్శిల్ పంపేవారు, స్వీకరించేవారి పూర్తి వివరాలతో పాటు వారి గుర్తింపు పత్రాల వివరాలను కూడా రికార్డులో భద్రపరచాలని స్పష్టం చేశారు. డ్రగ్స్ రవాణాకు సహకరించినట్లు తేలితే సంబంధిత సంస్థల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తెలంగాణలో డ్రగ్స్ నియంత్రణకు అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయంతో పనిచేస్తామని ఈగల్ ఫోర్స్ స్పష్టం చేసింది. రాష్ట్రంలో డ్రగ్స్ తయారీ, సరఫరా, రవాణా వ్యవస్థను పూర్తిగా అడ్డుకోవడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. మత్తు రహిత తెలంగాణే లక్ష్యమని ఈగల్ ఫోర్స్ అధికారి సందీప్ శాండిల్య పేర్కొన్నారు.

# 24 గంటలూ నిరంతర విద్యుత్ సరఫరా



**పులిచింతల,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరగడంతో పాటు జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గినప్పటికీ ప్రజలకు ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా నిరంతర సరఫరా అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. పులిచింతల జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి డిప్యూటీ సీఎం పరిశీలించారు. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం, ఇప్పటివరకు జరిగిన ఉత్పత్తి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. యూనిట్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి, అధికారులు ఏర్పాటు చేసిన పవ-ర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ఇదే సమయంలో రాష్ట్రంలో పీక్ విద్యుత్ డిమాండ్ 15 వేల మెగావాట్లు ఉండగా, ప్రస్తుతం దాదాపు 20 వేల మెగావాట్లకు చేరిందని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల కారణంగా నదులు, ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తగ్గి, జలవిద్యుత్ ఉత్పత్తి సుమారు 4 వేల మెగావాట్లు తగ్గిందన్నారు. డిమాండ్ పెరుగుదల, జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గుదల కలిపి సుమారు 8 వేల మెగావాట్ల అదనపు భారం ఏర్పడినప్పటికీ విద్యుత్ సంస్థలు సమర్థంగా పనిచేస్తూ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తున్నాయని వివరించారు.

**జలవిద్యుత్ కేంద్రాలన్నీ ఉత్పత్తికి సిద్ధం**

రాష్ట్రంలోని అన్ని జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో యంత్రాలు, యూనిట్లు పూర్తిస్థాయి సామ-ర్థ్యంతో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అవసరమైన స్థాయిలో నీటి లభ్యత లేకపోవడం వల్లే జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గిందని స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితులు, ఎండల తీవ్రత ఇందుకు ప్రధాన కారణాలన్నారు. "ఎన్ని సవాళ్లు ఎదురైనా గృహ వినియోగదారులకు 24 గంటలూ విద్యుత్ సరఫరా చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి కట్టుబడి ఉన్నాం. ప్రజలు విద్యుత్ సరఫరాపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు" అని డిప్యూటీ సీఎం తెలిపారు. రాత్రి వేళల్లో పెరిగే విద్యుత్ డిమాండ్‌ను థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా అధిగమిస్తున్నామని చెప్పారు. కర్ణాటకలో పీక్ విద్యుత్ డిమాండ్ సుమారు 20 వేల మెగావాట్లు ఉండగా తెలంగాణలోనూ ప్రస్తుతం అదే స్థాయికి చేరిందని, ఆంధ్రప్రదేశ్‌లో పీక్ డిమాండ్ సుమారు 12 వేల మెగావాట్లుగా ఉందని పేర్కొన్నారు.

**నీటిని పొదుపుగా వినియోగించాలి**

రాబోయే రోజుల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోతే నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని డిప్యూటీ సీఎం తెలిపారు. తదుపరి వర్షాకాలం వరకు అందుబాటులో ఉన్న నీటిని మనుషులు, పశువులు, పక్షుల తాగునీటి అవసరాలకు జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగిన పరిస్థిత-ుల్లోనూ నిరంతర విద్యుత్ సరఫరా కోసం శ్రమిస్తున్న జెన్‌కోతో పాటు విద్యుత్ సంస్థల సిబ్బందిని డిప్యూటీ సీఎం అభినందించారు.

**27 లక్షల మంది విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయాన్నే టిఫిన్ అందించే పథకానికి సంబంధించిన సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. అలాగే రాష్ట్రంలోని 105 నియోజకవర్గాల్లో ఒక్కో పా-ఠశాలకు రూ.200 కోట్ల చొప్పున కేటాయించి, అత్యాధునిక సదుపాయాలతో పాఠశాలలను నిర్మిస్తున్నామని చెప్పారు. ఒకే ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు చెందిన సుమారు 2,600 మంది విద్యార్థులు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యనభ్యసించేలా ఈ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని వివరించారు.



# కోస్గిలో భారీ స్థాయిలో కూల్చివేతలు

**కోస్గి,ఫ్లాష్ ఇండియా :** నారాయణపేట జిల్లా కోస్గి మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలో మంగళవారం ఉదయం 6 గంటల నుంచి భారీ స్థాయిలో కూల్చివేతలు కొనసాగుతున్నాయి. శివాజీ చౌరస్తా విస్తర-ణలో భాగంగా బుల్డోజర్లతో కూల్చివేతలను అధికారులు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ నాగరాజ్, సీఐ సైదులు, ఎస్ఐ చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో ఈ కూల్చివేతలు కొనసాగుతున్నాయి. భారీ బందోబస్తు మధ్య అధికారులు కూల్చివేతలను నిర్వహిస్తున్నారు. చౌరస్తా విస్తరణ పనుల్లో భాగంగా గతంలో పలుమార్లు సంబంధిత దుకాణ య-జమానులకు, నివాస గృహాల యజమానులకు నోటీసులు అందజేసినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం విస్తరణ పనులను వేగవంతం చేసేందుకు కూల్చివేతలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

# మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

- మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలి..
- క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలి..
- గర్రెపల్లి తెలంగాణ మోడల్ స్కూల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ కోయ శ్రీహర్షమ





**పెద్దపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలోని తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, బాలికల హాస్టల్, విద్యుత్ వ్యవస్థ, పాఠశాల పరిసరాలు, క్రీడా మైదానం తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. హాస్టల్‌లో కొన్ని గదుల తలుపులు సక్రమంగా లేకపోవడంతో పాటు విద్యుత్ వైరింగ్‌కు సంబంధించిన సమస్యలను గుర్తించారు. ఆయా సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాల, హాస్టల్‌లో అవసరమైన మరమ్మతు పనులను గుర్తించి వెంటనే చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అవసరమైన పనులకు అమ్మ ఆదర్శ పాఠశాల గ్రాంట్ ద్వారా నిధులు సమకూర్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**క్రీడలకు ప్రోత్సాహం**

విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను పెంపొందించేందుకు పాఠశాల క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలని కలెక్టర్ సూచించారు. మైదానంలో అవసరమైన గ్రౌండ్ లెవెలింగ్ పనులను పూర్తి చేసి విద్యార్థులు క్రీడల్లో చురుకుగా పాల్గొనేలా అనుకూల వాతావరణం కల్పించాలని ఆదేశించారు.

**పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి**

పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం లేకుండా నిరంతరం పరిశుభ్రత చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించే బాధ్యతను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా తీసుకోవాలని తెలిపారు. పాఠశాల, బాలికల హాస్టల్‌లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరిపి, సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించడంతో పాటు ఇంటర్మీడియట్‌లో జిల్లా స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించినందుకు పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. ఈ తనిఖీలో తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ గోల్డీ బుల్బీ కౌర్‌తో పాటు సంబంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రైతుల సంక్షేమమే ధ్యేయంగా మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి

## ఎమ్మెల్యే విజయరమణారావు సహకారంతో రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

**పెద్దపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్యాల రమేష్ తెలిపారు. తనపై విశ్వాసంతో ఈ బాధ్యతలు అప్పగించిన పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో సామాన్య కార్యకర్తగా పనిచేస్తున్న తనకు ఉన్నతమైన బాధ్యత కల్పించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. మార్కెట్ కమిటీ పరిధిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపడతానన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర, మార్కెటింగ్ సౌకర్యాలు అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే విజయరమణారావు సూచనలు, నాయకులు-కార్యకర్తల సహకారంతో మార్కెట్ కమిటీని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి తనవంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు.

# వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన



**మహాదేవపూర్, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** వన్యప్రాణి సప్తాహ కార్యక్రమాల్లో భాగంగా కాళేశ్వరం జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణ, వేట నిరోధం, జీవవైవిధ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ (ఎఫ్‌డీఓ) సందీప్ హాజరై మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతలో వన్యప్రాణులు కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. వన్యప్రాణులను వేటాడటం, అక్రమంగా పట్టుకోవడం, హింసించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. వన్యప్రాణుల సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేందర్ మాట్లాడుతూ ప్రకృతి, అడవులు, వన్యప్రాణుల పట్ల విద్యార్థులు బాధ్యతాయుతమైన వైఖరిని అలవర్చుకోవాలని సూచించారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవి మాట్లాడుతూ వన్యప్రాణుల వేట వల్ల కలిగే నష్టాలను వివరించడంతో పాటు, వాటి సంరక్షణ కోసం అటవీ శాఖ చేపడుతున్న చర్యలను విద్యార్థులకు వివరించారు. వన్యప్రాణుల పట్ల ప్రేమ, బాధ్యతను పెంపొందించుకుని, వాటి సంరక్షణకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ రేంజ్ అటవీ శాఖ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# కాళేశ్వరం నూతన ఎస్సైకి కాంగ్రెస్ నాయకుల సన్మానం

**మహాదేవపూర్, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** కాళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఇటీవల నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఇష్టబోయిన సురేష్‌ను కాంగ్రెస్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సన్మానించి, కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారి ప్రసాదాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లేతకారి రాజబాబు, యూత్ కాంగ్రెస్ నాయకుడు కొండగొర్ల సంతోష్, వార్డు మెంబర్ పానేం సంతోష్ పాల్గొన్నారు.

# ఆంజనేయ స్వామి అనుగ్రహం పొందాలి



**నల్లగొండ జిల్లా/ చింతపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ప్రతి ఒక్కరూ ఆంజనేయ స్వామి అనుగ్రహం పొందాలని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. మంగళవారం కొండమల్లెపల్లి మండలం జానిగాని తండాలోని ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించిన రమావత్ రవీంద్ర కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ....దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకుని, భక్తి భావంతో జీవించాలని సూచించారు. ఆధ్యాత్మికత మనిషిలో ప్రశాంతత, సానుకూల ఆలోచనలు పెంపొందించేందుకు దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**గూడూరు, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**

మహబూబాబాద్ శాసనసభ్యులు భూక్య మురళి నాయక్ ఆదేశాలతో గూడూరు గ్రామపంచాయతీ పరిధిలోని చంద్రు గూడెం కు చెందిన కొంకటి కవిత కు. 35 వేల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన గూడూరు సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మలు నాయక్. ఈ కార్యక్రమంలో గూడూరు మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి. ఉప సర్పంచ్ చంటి స్వామి. జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి ఎం డి రసూల్. సీనియర్ నాయకులు రాసమల్ల రాములు. ఎలమందల శ్రీనివాస్. పానుగంటి వీరస్వామి. చాంద్ పాషా. పాపాని శ్రీనివాస్. వార్డు సభ్యులు ధారావత్ కిషన్. గార్లపాటి శిరీష రాజేష్. పంజర బోయిన శీను. షాజహాన్. కుంచపు సాంబయ్య. రాజేష్. తదితరులు పాల్గొన్నారు.

# గూడూరులో ఘనంగా మానుకోట శాసనసభ్యులు మురళి నాయక్ జన్మదిన వేడుక



**గూడూరు, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**

గూడూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ ఆధ్వర్యంలో మానుకోట శాసనసభ్యులు డాక్టర్ మురళి నాయక్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మండల నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసే అనంతరం ప్రభుత్వ దావఖానలో రోగులకు పండ్లను పంపిణీ చేయడం జరిగింది. ఎమ్మెల్యే మురళి నాయక్. పదికాలాలపాటు పేద ప్రజలకు సేవలు అందిస్తూ ప్రజల ఆశీస్సులతో శ్రీ వీరాంజనేయ స్వామి దివ్య ఆశీస్సులతో నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని వారు వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధారావత్ బాలాజీ. నెక్కొండ మార్కెట్ వైస్ చైర్మన్ ఎడ్ల నరేష్ రెడ్డి. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొల్లికొండ మధు. గూడూరు పట్టణ అధ్యక్షులు రాసమల్ల యాకయ్య. మండల సీనియర్ నాయకులు పూజారి శంకర్ గౌడ్. అర్రెమ్ వీరస్వామి. సీతానగరం సర్పంచ్ మంగీలాల్. పొనుగోడు సర్పంచ్ మమత భాస్కర్. రాజన్న పల్లి సర్పంచ్ రవి. చిన్న ఎల్లాపురం సర్పంచ్ నీలా బాలు. లైన్ తండా సర్పంచ్ మానస నరేష్. అప్రాజపల్లి సర్పంచ్ భరత్. కొల్లాపురం సర్పంచ్ బాసు. అయోధ్య పురం సర్పంచ్ సుహాసిని అభిరామ్. బొద్దుగొండ సర్పంచ్ బండ కృష్ణ. నెక్కొండ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కందిక సుమలత. సమ్మెట శ్రీను. నాయకులు కందిక శంకర్. రాయలపాటి యాకయ్య. ఈసం నరసయ్య. పేరాల సురేందర్. మారెల్లి శోభన్ బాబు. మూడు వీరన్న. వాసం వీరస్వామి. తంగళ్ళపల్లి కృష్ణ. కర్రె యాకయ్య. శివరాత్రి వెంకటేష్. జరుపుల శ్రీనివాస్. వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

# కొండమల్లేపల్లిలో ఎంవీ కార్యాలయం నిర్మాణానికి స్థలం సిద్ధం



**నల్లగొండ జిల్లా / చింతపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** దేవరకొండ నియోజకవర్గానికి చెందిన వాహనదారులు రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర పనుల కోసం నల్లగొండకు పలుమార్లు వెళ్లాల్సి వస్తోంది. నియోజకవర్గ పరిధి నుంచి నల్లగొండకు సుమారు 1,200 మంది వాహనదారులు, 400--500 వాహనాలు ప్రతిరోజూ వివిధ పనుల నిమిత్తం వెళ్తున్నట్లు స్థానికులు తెలిపారు. వాహనాల సంఖ్య అధికంగా ఉండటంతో కొండమల్లేపల్లిలో ఎంవీ కార్యాలయం ఏర్పాటు చేస్తే స్థానిక వాహనదారులతో పాటు దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు కోరుతున్నారు. ఉపయోగం నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు ఎంతో ఉపయోగపడే విధంగా కొండమల్లేపల్లిలో ఎంవీ కార్యాలయం ఏర్పాటు కోసం స్థలం కేటాయించి, కార్యాలయ నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. కార్యాలయం అందుబాటులోకి వస్తే వాహనదారులు నల్లగొండకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో పాటు, వాహన తనిఖీలు, రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ తదితర సేవలను స్థానికంగానే పొందే అవకాశం ఉంటుంది. దీనివల్ల ప్రజలకు సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా అవుతాయని వారు పేర్కొన్నారు. అధికారుల స్పందన ఇటీవలే ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయని, త్వరలోనే కొండమల్లేపల్లి పరిసరాల్లో ఎంవీ కార్యాలయం ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. వాహనదారులు, నియోజకవర్గ ప్రజలు, ప్రజాప్రతినిధులు కూడా కార్యాలయ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

# బిజెపి పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో సేవా జ్యోతి కార్యక్రమం



**వికారాబాద్ జిల్లా / చౌడాపూర్ మండల, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఉమ్మడి హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్నగర్ జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ సన్నాహక సమావేశం మండల కార్యశాల నేడు వికారాబాద్ జిల్లాలో సేవాజ్యోతి సంకల్ప అభియాన్ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాద రావు గారు శ్రీ నరేంద్ర మోడీ గారు 25 సంవత్సరాల పరిపాలన దేశంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చిన దేశ అధినేత శ్రీ నరేంద్ర మోడీ గారు రేపు వికారాబాద్ జిల్లాలో దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు ఈ కార్యక్రమానికి మండలాల నుంచి బైకు ర్యాలీ నిర్వహిస్తున్నారు. కాబట్టి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాద రావు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు గోవింద్ నాయక్, వికారాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు బందయ్య, కులకచర్ల మండల అధ్యక్షులు గుడాల వెంకటేష్, మండల ప్రధాన కార్యదర్శిలు వెంకటేష్, రాజశేఖర్, మాసయ్య, యాదవ్, జనార్ధన్, శివకుమార్, సంతోష్, శంకర్ నాయక్, కేశవులు, గోపి, శ్రీనివాస్, కృష్ణ, ప్రవీణ్, గౌడ్, రమేష్, రఘు, రాము, మల్లేష్, రమేష్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# అక్రమ బెల్ట్ షాపులను తొలగించాలి...

**మిర్యాలగూడ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** భారతీయ జనతా పార్టీ మిర్యాలగూడ వన్ టౌన్ ఆధ్వర్యంలో మంగళవారం మిర్యాలగూడ ఎక్సైజ్ పోలీస్ ఆఫీసర్స్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. వన్ టౌన్ అధ్యక్షులు బంటుగిరి, ప్రధాన కార్యదర్శిలు కొంగరి వెంకటరమణ, మూల రాజి రెడ్డి ల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా బంటు గిరి మాట్లాడుతూ పట్టణంలో కళాశాలలో పాఠశాలలు మరియు దేవాలయ పరిసరాలలో పుట్టగొడుగుల్లా వెలిసిన బెల్ట్ షాపుల వల్ల పట్టణ ప్రజలు విద్యార్థిని, విద్యార్థులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు అని అన్నారు. ఈ బెల్ట్ షాపులలో మందు తాగే మందుబాబుల వల్ల ఆ బిల్ట్ షాప్ పరిసర ప్రాంతాల్లో ప్రతిరోజు మందుబాబులు ఘర్షణలకు దిగుతూ ప్రజలను తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. కావున తక్షణమే పట్టణంలో ఉన్న అన్ని బెల్ట్ షాపుల మీద చర్యలు తీసుకొని పట్టణ ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు కొండేటి సరిత, నల్గొండ జిల్లా కార్యదర్శి చిల్లంచర్ల అభి తదితరులు పాల్గొన్నారు.

# రేగోడు పీఎం శ్రీ మోడల్ పాఠశాలలో 'స్పెషల్ గెస్ట్ ఎడ్యుకేటర్' పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**మెదక్ జిల్లా / రేగోడు, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :**

రేగోడు మండల కేంద్రంలోని పీఎం శ్రీ మోడల్ పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల (CWSN) కోసం ఒక 'స్పెషల్ గెస్ట్ ఎడ్యుకేటర్' (Special Guest Educator) పోస్టు ఖాళీగా ఉన్నట్లు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ప్రవీణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నియామకానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి:

* **కావలసిన అర్హత:** స్పెషల్ బి.ఇడి (Special B.Ed) పూర్తి చేసి, సంబంధిత బోధనా అర్హతలు కలిగి ఉండాలి.

* **వేతనం & కాలపరిమితి:** ఎంపికైన అభ్యర్థికి నెలకు రూ. 16,500 చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తారు. ఈ నియామకం కేవలం 10 నెలల కాలపరిమితికి మాత్రమే వర్తిస్తుంది.

* **దరఖాస్తు గడువు:** ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల (అక్టోబర్) 7వ తేదీ లోపు తమ దరఖాస్తులను అవసరమైన ధ్రువీకరణ



పత్రాలతో కలిపి రేగోడు పీఎం శ్రీ మోడల్ పాఠశాలలో స్వయంగా అందజేయాల్సి ఉంటుంది.

* **విధుల్లో చేరిక:** ఎంపికైన అభ్యర్థులు వచ్చే నెల (నవంబర్) నుండి విధుల్లో చేరాల్సి ఉంటుంది. ఈ నియామకాల్లో స్థానిక అభ్యర్థులకే మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. అర్హత మరియు ఆసక్తి గల స్థానిక అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర పూర్తి వివరాల కోసం పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలిని నేరుగా సంప్రదించాలని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ సంచలన నిర్ణయం

భారత మహిళా క్రికెట్ జట్టు దిగ్గజ సారథి హర్మన్‌ప్రీత్ కౌర్ క్రీడా వర్గాలను విస్మయానికి గురి చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. మూడు ఫార్మాట్లలో భారత జట్టు కెప్టెన్సీ బాధ్యతల నుంచి తక్షణమే వైదొలుగుతున్నట్లు ఆమె అధికారికంగా ప్రకటించారు. ఈ కఠిన నిర్ణయాన్ని సోషల్ మీడియా ద్వారా వెల్లడించిన హర్మన్.. కెప్టెన్సీ నుంచి తప్పుకున్నప్పటికీ జట్టులో సీనియర్ క్రీడాకారిణిగా తన సేవలను కొనసాగిస్తానని స్పష్టం చేశారు. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోనే భారత మహిళల జట్టు చారిత్రక విజయాలను నమోదు చేసింది. ముఖ్యంగా 2025లో భారత జట్టు ప్రతిష్టాత్మక వన్డే ప్రపంచకప్‌ను కైవసం చేసుకోవడంతో పాటు, ఏషియన్ గేమ్స్‌లో స్వర్ణ పతకాన్ని సాధించి దేశ కీర్తి పతాకను విశ్వవేదికపై రెపరెపలాడించింది. ఆమె నాయకత్వంలో టీమిండియా ఐసీసీ టోర్నీల్లో ఎన్నో అద్భుత రికార్డులను నెలకొల్పింది.హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్య బాధ్యతల నుంచి తప్పుకోవడంతో, తదుపరి భారత మహిళా క్రికెట్ జట్టు పూర్తి స్థాయి కెప్టెన్‌గా స్టార్ బ్యాటర్, ప్రస్తుత వైస్ కెప్టెన్ స్మృతి మంధాన బాధ్యతలు చేపట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయి. గత కొన్నేళ్లుగా జట్టులో కీలక ఆధారంగా ఉంటూ, నాయకత్వ లక్షణాలతో మెరుస్తున్న స్మృతి మంధానకే బీసీసీఐ సెలక్షన్ కమిటీ జైకొట్టే సూచనలు కనిపిస్తున్నాయి. కెప్టెన్సీ భారం దిగిపోవడంతో హర్మన్‌ప్రీత్ కేవలం తన బ్యాటింగ్‌పైనే మరింత దృష్టి సారించే వీలుంటుందని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. మహిళల క్రికెట్‌ను సరికొత్త శిఖరాలకు చేర్చిన హర్మన్ కెప్టెన్సీ ప్రస్థానం భారత క్రికెట్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని అభిమానులు, మాజీ క్రికెటర్లు ప్రశంసిస్తున్నారు.

# తొలి టీ20లో వైభవ్‌కు ఛాన్స్ ఉందా?



వెస్టిండీస్‌తో ఐదు టీ20ల సిరీస్‌కు టీమిండియా సిద్ధమైంది. మంగళవారం రాత్రి 7 గంటలకు లక్నోలోని ఏకానా స్టేడియంలో తొలి టీ20 ఆరంభం కానుంది. మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకున్న టీమిండియా.. ఇప్పుడు టీ20 సిరీస్‌లోనూ అదే జోరును కొనసాగించాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో తొలి మ్యాచ్‌కు టీమిండియా కూర్పు ఎలా ఉండబోతోంది?, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో అవకాశం దక్కుతుందా? అనే దానిపై ఆసక్తి నెలకొంది. తొలి టీ20కు ముందు భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ మీడియాతో మాట్లాడారు. తుది జట్టుపై నిర్ణయంను కెప్టెన్, హెడ్ కోచ్ కలిసి తీసుకుంటారని తెలిపారు.'గౌతమ్ గంభీర్ ఆటగాళ్లను రొటేట్ చేస్తారని నేను భావిస్తున్నాను. తుది జట్టును ఎంచుకునే బాధ్యత సెలెక్టర్లు, కోచ్, కెప్టెన్‌పై ఉంటుంది. తదుపరి ప్రపంచ కప్‌లో భారత్ విజయం సాధించేందుకు ఏ కూర్పు అత్యుత్తమంగా ఉంటుందో దానినే పరిగణనలోకి తీసుకుంటాం. అదే మా ప్రధాన లక్ష్యం' అని బౌలింగ్ కోచ్ మోర్కెల్ పేర్కొన్నారు. తొలి టీ20లో 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి అవకాశం దక్కుతుందా? అనే ప్రశ్నకు.. అతడిలో ఉన్న టాలెంట్ గురించి టీమ్ మేనేజ్‌మెంట్‌కు పూర్తిగా తెలుసని చెప్పారు. 'వైభవ్‌లో ఉన్న ప్రతిభ గురించి మనందరికీ తెలుసు. అతడు సీనియర్ ఆటగాళ్లతో ఎంత ఎక్కువ సమయం గడిపితే అంత మంచిది. ఈ స్థాయిలో అతడు ఎక్కువగా శిక్షణ పొందడం అతడి క్రికెట్‌కు ఎంతో ఉపయోగపడుతుంది' అని మోర్కెల్ అన్నారు.ఒకవేళ తొలి మ్యాచ్‌లో వైభవ్‌కు తుది జట్టులో చోటు దక్కకపోయినా.. అతడికి టీమ్‌తో కలిసి ఉండటం ద్వారా చాలా నేర్చుకునే అవకాశం ఉంటుందని మోర్కెల్ వివరించారు. డ్రెస్సింగ్ రూమ్‌లో సీనియర్ ఆటగాళ్లతో మాట్లాడటం, వారి ఆటను దగ్గరగా గమనించడం కూడా యువ ఆటగాడి ఎదుగుదలలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. సీనియర్ ఆటగాళ్లు తమ ఇన్నింగ్స్‌ను ఎలా ప్రారంభిస్తారు? తొలి 15 బంతులను ఎలా ఎదుర్కొంటారు? పరిస్థితులకు అనుగుణంగా ఎలాంటి వ్యూహాలు రూపొందించుకుంటారు? వంటి అంశాలను యువ ఆటగాళ్లు గమనించాలని మోర్కెల్ సూచించారు.అవకాశాలు ఎక్కువగా దక్కినా, పరిమితంగా లభించినా యువ ఆటగాళ్లు నేర్చుకునేలా చేయడం టీమ్ మేనేజ్‌మెంట్ బాధ్యత అని మోర్నీ మోర్కెల్ స్పష్టం చేశారు. ప్రశ్నలు అడుగుతూ, సీనియర్ల నుంచి నేర్చుకుంటూ ఎదగడం వైభవ్‌కు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. దీంతో వెస్టిండీస్‌తో తొలి టీ20లో వైభవ్ తుది జట్టులో ఉంటాడా? లేదా బెంచ్‌కే పరిమితం అవుతాడా? అనే ఆసక్తి మరింత పెరిగింది. అయితే మ్యాచ్ ఆడకపోయినా సీనియర్ ఆటగాళ్లతో కలిసి గడిపే ప్రతి క్షణం వైభవ్ భవిష్యత్‌కు ఉపయోగపడుతుందని మోర్కెల్ అంటున్నాడు.

# హార్దిక్ పాండ్యాకు ఆఫర్లే ఆఫర్లు..



టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్, ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా ట్రేడ్‌కు సంబంధించి మరోసారి నెట్టింట చర్చలు మొదలయ్యాయి. ఐపీఎల్ 2027 రిటెన్షన్ గడువు సమీపిస్తున్న వేళ.. పాండ్యాను తమ జట్టులోకి తీసుకునేందుకు పలు ఫ్రాంచైజీలు ముంబై యాజమాన్యాన్ని సంప్రదించినట్లు సమాచారం. ఫిట్‌నెస్‌పై ఆందోళనలు ఉన్నప్పటికీ.. బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ మ్యాచ్‌ను మలుపుతిప్పగల సామర్థ్యం ఉండటంతో హార్దిక్‌కు ఐపీఎల్‌లో భారీ డిమాండ్ ఉంది.ఐపీఎల్ 2026 సీజన్ ముగిసినప్పటి నుంచి హార్దిక్ పాండ్యా ట్రేడ్‌పై పలు జట్లు ఆసక్తి చూపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్), చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) సహా కొన్ని ఫ్రాంచైజీలు ముంబై ఇండియన్స్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. క్రిక్‌బజ్ నివేదిక ప్రకారం.. తాజాగా ఒక జట్టు హార్దిక్ కోసం మరోసారి ముంబై మేనేజ్‌మెంట్‌ను సంప్రదించింది. ముంబై కూడా కొన్ని ఫ్రాంచైజీలతో హార్దిక్ ట్రేడ్ అంశంపై చర్చలు జరిపింది. హార్దిక్ ట్రేడ్‌లో సీఎస్‌కే పేరు కీలకంగా వినిపిస్తోంది. అయితే ప్రస్తుతం చెన్నై జట్టుకు హెడ్ కోచ్‌గా జహీర్ ఖాన్ నియమితుడు కావడంతో.. హార్దిక్ సీఎస్‌కేకు వెళ్లే అవకాశాలు తగ్గినట్లు నివేదిక పేర్కొంది. ముంబై మేనేజ్‌మెంట్‌లో జహీర్ ఉన్న సమయంలో హార్దిక్‌తో అతడికి విభేదాలు ఉన్నాయనే ప్రచారం జరిగిన విషయం తెలిసిందే.అయితే ఇప్పుడు పరిస్థితులు మారనున్నాయి క్రిక్‌బజ్ తన నివేదికలో పేర్కొంది. చెన్నై సూపర్ కింగ్స్‌లో కొత్త మేనేజ్‌మెంట్, కొత్త సెటప్ ఏర్పడటంతో గతంలోని వ్యక్తిగత లేదా వృత్తిపరమైన సంబంధాలు మారనున్నాయట. అందువల్ల జహీర్ ఖాన్, హార్దిక్ పాండ్యా మధ్య విబేధాల ప్రభావం ట్రేడ్‌పై ఎంతవరకు ఉంటుందనేది చెప్పలేము. హార్దిక్ ట్రేడ్‌పై వచ్చే నెల రోజుల్లో క్లారిటీ రానుంది. ఐపీఎల్ రిటెన్షన్‌కు నవంబర్ 15 చివరి తేదీ కాబట్టి.. అప్పటిలోగా ఫ్రాంచైజీలు కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. డిసెంబర్‌లో ఐపీఎల్ వేలం జరగనున్న నేపథ్యంలో హార్దిక్ భవిష్యత్తుపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.హార్దిక్ పాండ్యా ప్రస్తుతం ఫిట్‌నెస్ సమస్యలతో ఇబ్బంది పడుతున్నాడు. గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని టీమిండియా మేనేజ్‌మెంట్ అతడి ఫిట్‌నెస్‌ను పరిశీలిస్తోంది. రాబోయే న్యూజిలాండ్ పర్యటనకు హార్దిక్ దూరం కానున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచ కప్‌లో హార్దిక్ పాండ్యా టీమిండియా ప్రణాళికల్లో కీలక ఆటగాడిగానే ఉన్నాడు. బ్యాట్‌తో పాటు బంతితోనూ మ్యాచ్‌ను ఒంటిచేత్తో మలుపుతిప్పగల సామర్థ్యం హార్దిక్‌కు ఉండడం అతడికి కలిసొచ్చే అంశం. దీంతో ఐపీఎల్‌లో అతడి ట్రేడ్ వ్యవహారం అటు ముంబై ఇండియన్స్‌తో పాటు ఇటు ఇతర ఫ్రాంచైజీల్లోనూ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రస్తుతం హార్దిక్ ముంబైలోనే కొనసాగుతున్నప్పటికీ.. రిటెన్షన్ గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ట్రేడ్‌పై వస్తున్న తాజా నివేదికలు ఆసక్తిని పెంచుతున్నాయి.

# ఆర్కిటిక్ ఓపెన్‌లో సింధు..



ఆసియా క్రీడల్లో నిరాశపర్చిన ఇండియా షట్లర్లు ఇప్పుడు బీడబ్ల్యూఎఫ్ సర్క్యూట్‌పై దృష్టిపెట్టారు. ఈ నేపథ్యంలో నేటి నుంచి జరిగే ఆర్కిటిక్ ఓపెన్ సూపర్--500 టోర్నీలో బరిలోకి దిగనున్నారు. రెండుసార్లు ఒలింపిక్ విజేత పీవీ సింధు తొలి రౌండ్‌లో క్వాలిఫయర్‌తో తలపడనుంది. ఈ ఏడాది జపాన్ ఓపెన్ విజేతగా నిలిచిన సింధు మంచి ఫామ్‌లో ఉంది. మెన్స్ సింగిల్స్ తొలి రౌండ్‌లో కిడాంబి శ్రీకాంత్.. బ్రియాన్ యంగ్ (కెనడా)ను ఎదుర్కోనున్నాడు. హెచ్.ఎస్. ప్రణయ్.. నాలుగోసీడ్ అండర్స్ ఆంటోన్‌సెన్ (డెన్మార్క్)తో తలపడతాడు. విమెన్స్ సింగిల్స్‌లో తన్వీ శర్మ, ఇషానీ బారువా, అస్మితా చాలిహా, ఉన్నతి హుడా తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

# బిజినెస్

## మరోసారి ట్రిలియనీర్‌గా మస్క్



టెక్ ఆంత్రప్రెన్యూర్ ఎలాన్ మస్క్ మరోసారి ట్రిలియనీర్‌గా మారారు. టెస్లా స్పేస్ ఎక్స్ సంస్థల షేర్ల విలువ ఇటీవల పెరగడంతో సోమవారం మస్క్ నికర సంపద 65 బిలియన్ డాలర్ల మేర పెరిగి 1.04 ట్రిలియన్‌లకు చేరుకుంది. ఈ నెల ప్రారంభం నుంచి నేటి వరకూ స్పేస్ ఎక్స్ సంస్థ షేరు విలువ 13 శాతం మేర పెరగ్గా టెస్లా షేరు ధర కూడా 6.7 శాతం మేర ఎగబాకింది. ఈ ఏడాదిలో మస్క్ సంపద ట్రిలియన్ డాలర్ల మార్కు దాటడం ఇది రెండోసారిఈ ఏడాది జూన్‌లో మస్క్ తొలిసారిగా ప్రపంచపు మొట్టమొదటి ట్రిలియనీర్‌గా మారిన విషయం తెలిసిందే. ఐపీఓ నేపథ్యంలో స్పేస్ ఎక్స్ సంస్థ షేర్లు భారీగా పెరగడంతో మస్క్ నికర సంపద విలువ కూడా పెరిగింది. అయితే, సంస్థ మార్కెట్ విలువపై అంచనాలు ఉండవల్సిన దానికంటే ఎక్కువగా ఉన్నట్టు నిపుణులు భావిండచంతో షేర్ల అమ్మకాలు పెరిగాయి. ఫలితంగా మస్క్ నికర సంపద అప్పట్లో ట్రిలియన్ డాలర్ల మార్కు దిగువకు పడిపోయింది.ప్రస్తుతం స్పేస్ ఎక్స్, టెస్లా షేర్లపై మదుపర్లు ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా అంతరిక్ష పరిశోధన రంగంలో విశ్వసనీయ సంస్థగా స్పేస్ ఎక్స్ మారుతున్న నేపథ్యంలో సంస్థ షేర్లకు డిమాండ్ పెరిగింది. మస్క్ సారథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ మీడియా వేదికలు కూడా మంచి పురోగతిని సొంతం చేసుకున్నాయి. ఇటీవల ముగిసిన త్రైమాసికంలో టెస్లా కార్ల విక్రయాలు అంచనాలను మించిపోయాయి. మస్క్ నికర సంపదలో టెస్లా, స్పేస్ ఎక్స్ సంస్థల షేర్ల వాటానే 98 శాతంగా ఉంది..

# మరోసారి పెరగనున్న టెలికాం రీఛార్జ్ ధరలు




టెలికాం యూజర్ల జేబులకు త్వరలోనే పెద్ద చిల్లు పడనుంది. దేశీయ టెలికాం రంగంలో పోటీ తగ్గి, మార్కెట్ స్థిరంగా ఉండటంతో రాబోయే 4 నుండి 5 నెలల్లో మొబైల్ రీఛార్జ్ ధరలను మరో 12 నుండి 15 శాతం వరకు పెంచేందుకు జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా సంస్థలు సిద్ధమవుతున్నాయి. దేశవ్యాప్తంగా 5జీ నెట్‌వర్క్ కవరేజీని వేగంగా విస్తరించడం, హై-స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందుబాటులోకి తేవడం, కంపెనీల నెట్‌వర్క్ నిర్వహణ ఖర్చులు గణనీయంగా పెరగడమే ఈ టారిఫ్ పెంపునకు ప్రధాన కారణం. దీనికి తోడు ప్రతి వినియోగదారుడి నుండి వచ్చే సగటు ఆదాయాన్ని (ఆర్పు) పెంచుకోవాలని కంపెనీలు భావిస్తుండటంతో, నెలవారీ రీఛార్జ్ ప్లాన్ల ధరలు మరింత ప్రియం కానున్నాయి. ఇప్పటికే పెరిగిన ఖర్చులతో సతమతమవుతున్న సామాన్యులు, డిజిటల్ వినియోగదారులపై ఈ తాజా టారిఫ్ బాదుడు అదనపు ఆర్థిక భారంగా మారనుంది. ఇప్పటికే, జూన్ తర్వాత జియో కొత్తగా 80 లక్షల మంది సబ్‌స్క్రైబర్లను చేర్చుకొని తన యూజర్ బేస్‌ను 54.1 కోట్లకు పెంచుకోగా, ఆర్పు నెలకు రూ. 218కి చేరింది. అలాగే భారతీ ఎయిర్‌టెల్ 30 లక్షల కొత్త సబ్‌స్క్రైబర్లతో మొత్తం 38 కోట్లకు చేరడంతో పాటు, పరిశ్రమలోనే అత్యధికంగా రూ. 269 ఆర్పుని నమోదు చేసింది.



# ఇండిగో విమాన ఛార్జీల బాదుడు

ఏటీఎఫ్ ధరలు వరుసగా పెరుగుతుండటంతో దేశీయ ఎయిర్‌లైన్ సంస్థ ఇండిగో విమాన ప్రయాణికులకు గట్టి షాకిచ్చింది. దేశీయ, అంతర్జాతీయ మార్గాల్లో ఇంధన సర్‌ఛార్జ్‌ను పెంచుతున్నట్లు సోమవారం అధికారికంగా ప్రకటించింది. గతవారం ఎయిర్‌లైన్ ఇంధన ధర లీటరుకు రూ.16 చొప్పున పెరగ్గా, అంతకుముందు ఆగస్టులో రూ. 5, సెప్టెంబర్‌లో మరో రూ. 6.28 మేర పెరిగింది. విమానయాన సంస్థల మొత్తం నిర్వహణ ఖర్చులలో ఈ ఇంధన వ్యయమే ఏకంగా 40 శాతం వరకు ఉండటంతో, భారాన్ని తట్టుకోవడానికి ఏప్రిల్ తర్వాత మళ్లీ ఇప్పుడు పెంచక తప్పలేదని సంస్థ స్పష్టం చేసింది. ఈ కొత్త సర్‌ఛార్జ్ ధరలు అక్టోబర్ 6 నుండి చేసే అన్ని కొత్త బుకింగ్‌లకు వర్తిస్తాయి. ఈ పెంచిన సర్‌ఛార్జ్ వల్ల దూరాన్ని బట్టి టికెట్ ధరలు రూ. 100 నుండి రూ. 350 వరకు పెరగనున్నాయి. 500 కి.మీ. వరకు ఉండే రూట్‌లకు రూ. 375, 1,000 కి.మీ.కు రూ. 600, 1,500 కి.మీ.కు రూ. 900, 2,000 కి.మీ. వరకు రూ. 1,150 సర్‌ఛార్జ్ వర్తిస్తుంది. 2,000 కి.మీ. దాటే సుదీర్ఘ మార్గాలకు రూ. 1,300 చొప్పున వసూలు చేయనున్నారు. అంతర్జాతీయ సర్వీసుల్లో, 'సార్క్' దేశాల విమానాలకు రూ. 1,000 నుండి రూ. 3,000 వరకు, ఆఫ్రికాకు రూ. 6,000, యూరప్ వెళ్లే సర్వీసులపై రూ. 10,000 వరకు ఇంధన సర్‌ఛార్జ్ భారం పడనుంది.

# పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరలు




ఈ రోజు(అక్టోబర్ 6 ) పెట్రోల్ డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పులు లేవు. ఈ తరుణంలో హైదరాబాద్‌లో ప్రస్తుతం పెట్రోల్ ధర లీటరుకు రూ.116.15గా ఉంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో ఈ రోజు( మంగళవారం ) పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం.

**నేటి పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరలు..**

హైదరాబాద్
లీటర్ పెట్రోల్ ధర: రూ.116.15
లీటర్ డీజిల్ ధర రూ.104.23
సీఎన్‌జీ ధర:రూ.112.00

వరంగల్
లీటర్ పెట్రోల్ ధర: రూ.115.35
లీటర్ డీజిల్ ధర రూ.103.74
సీఎన్‌జీ ధర:రూ.110.00

విశాఖపట్నం
లీటర్ పెట్రోల్ ధర: రూ.116.39
లీటర్ డీజిల్ ధర రూ.104.11
సీఎన్‌జీ ధర:రూ.92.50

విజయవాడ
లీటర్ పెట్రోల్ ధర: రూ.117.25
లీటర్ డీజిల్ ధర రూ.104.96
సీఎన్‌జీ ధర:రూ.103.00

# ధరలను చెక్ చేసుకున్నారా?



భారత్‌లో ఈ వారం బంగారం ధరలు దాదాపుగా స్థిరంగానే కొనసాగుతున్నాయి. రూ.1.5 లక్షలకు దిగువనే కదలాడుతున్నాయి. దేశంలో మేలిమి బంగారం ధర నిన్నటితో పోలిస్తే నేడు స్వల్పంగా మాత్రమే తగ్గింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు ఉదయం 10.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,49,020గా ఉంది. నిన్నటి ముగింపు ధరతో పోలిస్తే కేవలం రూ.160ల మేర తగ్గింది. 10 గ్రాముల ఆర్నమెంటల్ పసిడి ధర కూడా రూ.150ల మేర తగ్గి రూ.1,36,600కు చేరుకుంది. వెండి మాత్రం మరింతగా తగ్గింది. కిలో వెండి ప్రస్తుతం రూ.2.35 లక్షలుగా ఉంది.





# నమ్మకం లేకుండా పోయిందా?




టాలీవుడ్ లో ఇప్పుడు ఏ పెద్ద సినిమా అనౌన్స్ మెంట్ వచ్చినా సరే, ప్రేక్షకులు ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్టోబర్ 9న థియేటర్లలోకి రావాల్సిన 'ఆదర్శ కుటుంబం' చిత్రం మరోసారి వాయిదా పడటంతో సినీ ప్రియులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ సినిమా విషయంలో ఇప్పటికి మూడుసార్లు విడుదల తేదీలు మారడం ఇండస్ట్రీలో పెద్ద చర్చకు దారితీసింది. మొదట సమ్మర్ రిలీజ్ అన్నారు, ఆ తర్వాత అక్టోబర్ 2 అని ప్రకటించారు, చివరికి అక్టోబర్ 9న పక్కా అన్నారు. కానీ తీరా సమయానికి వచ్చేసరికి సినిమా మళ్లీ పోస్ట్ పోన్ అయింది.సినిమా రిలీజ్ విషయంలో క్లారిటీ లేకుండా "ఫస్ట్ కాపీ స్టేటస్ ఏంటో పూర్తిస్థాయిలో చూడకుండానే తొందరపడి రిలీజ్ డేట్ ప్రకటించాం.. ఇకపై మరోసారి అలాంటి తప్పు చేయం" అంటూ నిర్మాత చెప్పారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దసరా లాంటి అతిపెద్ద పండగ సీజన్ ను హాలిడేస్ తో సహా వేస్ట్ చేసుకోవడం వల్ల బాక్సాఫీస్ వద్ద రావాల్సిన భారీ కలెక్షన్లను మేకర్స్ కోల్పోయినట్లయింది. మళ్లీ ఇలాంటి సోలో పండగ డేట్ దొరకడం అంత సులభం కాదు.కోట్లాది రూపాయల బడ్జెట్ తో సినిమాలు నిర్మించే దర్శకనిర్మాతలు రిలీజ్ డేట్ దగ్గర ఎందుకు తడబడుతున్నారనేది ప్రధాన ప్రశ్న. పోస్ట్ ప్రొడక్షన్, గ్రాఫిక్స్ పనుల్లో ఆలస్యం ఒకవైపు ఐతే, మరోవైపు రిలీజ్ డేట్ల నిర్వహణ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల చేతుల్లోకి వెళ్లిపోవడమూ మరో కారణం. ఓటీటీ సంస్థలు ఇచ్చిన గడువు ప్రకారం థియేటర్లలో విడుదల కాకపోతే ఓటీటీ రైట్స్ బిజినెస్ డీల్స్ లో భారీగా కోతలు విధించే ప్రమాదం ఉంది. అయినా సరే రష్ పనులతో నాసిరకం ఔట్ పుట్ ఇచ్చి సోషల్ మీడియా ట్రోల్స్ కి గురవ్వడం కంటే, వాయిదా వేసుకోవడమే బెటర్ అని మేకర్స్ భావిస్తున్నారు.కేవలం ఈ ఒక్క చిత్రమే కాదు ప్రభాస్ ఫౌజీ రిలీజ్ కూడా పోస్ట్ పోన్ అయింది. అలాగే ఏప్రిల్ 7న 'వారణాసి' వస్తుందని, ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ కాంబినేషన్ మూవీ జూన్ 11న 'డ్రాగన్' వస్తుందని ప్రకటించినప్పటికీ రిలీజ్ అవుతాయో లేదోనని డౌట్ ఉంది. పోస్ట్ పోన్ సంస్కృతి వల్ల ప్రాజెక్ట్ బడ్జెట్ పెరగడమే కాకుండా, ప్రమోషన్ల కోసం ఖర్చు చేసిన కోట్లాది రూపాయలు బూడిదలో పోసిన పన్నీరవుతున్నాయి. హీరో లేదా పెద్ద సినిమా థియేటర్ పోస్టర్ పై "రన్నింగ్ సక్సెస్ ఫుల్లీ" అని పడేవరకు ప్రేక్షకుడు రిలీజ్ డేట్ ని నమ్మలేని పరిస్థితులు టాలీవుడ్ లో నెలకొన్నాయి.




# విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో హారర్ థ్రిల్లర్..

యంగ్ బ్యూటీ పూజిత పొన్నాడ ప్రధాన పాత్రలో నటిస్తున్న సరికొత్త హారర్ థ్రిల్లర్ చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. 'కమిటీ కుర్రోళ్లు' సినిమాతో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న యువ నటుడు ఈశ్వర్ రాచిరాజు ఈ చిత్రంతో సోలో హీరోగా టర్న్ అవుతున్నారు. అలాగే ఈ సినిమాలో నందు లిఖిత మరో కీలక పాత్రలో కనిపించబోతున్నారు. 'ఎస్ఆర్ కళ్యాణమండపం' లాంటి విజయవంతమైన సినిమాకు దర్శకత్వం వహించిన శ్రీధర్ గాదె ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. శ్రీ ఐశ్వర్య లక్ష్మీ మూవీస్ బ్యానర్‌పై ప్రొడ్యూసర్ వెంకట్ తలారి ఈ సినిమాను ప్రొడక్షన్ నెం.3గా నిర్మిస్తున్నారు. ఇటీవల పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైన ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది.ఈ నేపథ్యంలోనే నేడు హీరోయిన్ పూజిత పొన్నాడ పుట్టినరోజు కావడంతో, మేకర్స్ ఆమెకు స్పెషల్ విషెస్ చెబుతూ సినిమాలో ఆమె పాత్రకు సంబంధించిన కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో ఆమె 'నర్తకి' అనే శక్తివంతమైన పాత్రలో నటిస్తున్నట్లు వెల్లడించారు. పూజిత పొన్నాడకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, రాబోయే ఏడాది ఆమెకు నిరంతర విజయాలను, మరిన్ని అద్భుతమైన మైలురాళ్లను అందించాలని కోరుకుంటున్నట్లు చిత్ర బృందం పేర్కొంది. పూర్తిగా విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో ఒక సరికొత్త హారర్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రూపొందుతోంది. అయితే ఇందులో పూజిత పొన్నాడతో పాటు సింధు కాసారం, సురేష్ గురు, రాయల్ శ్రీ, మట్టా శివకుమార్, విహా దికొండ, సునీత మనోహర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విలేజ్ నేటివిటీకి హారర్ ఎలిమెంట్స్ జోడించి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి.




# రజనీకాంత్ మాస్ తాండవం!

బాక్సాఫీస్‌ను షేక్ చేసిన 'జైలర్' తర్వాత, భారీ అంచనాల నడుమ సీక్వెల్ 'జైలర్ 2' తెలుగు ట్రైలర్ ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కించిన ఈ ట్రైలర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో బాగానే ట్రెండ్ అవుతోంది. సూపర్ స్టార్ రజనీకాంత్ మరోసారి 'టైగర్ ముత్తువేల్ పాండియన్'గా స్క్రీన్‌పై అడుగుపెట్టి తనదైన స్టైల్, స్వాగ్‌తో కనిపించారు. పార్ట్-1లో విలన్ వర్మన్‌ను అంతం చేసిన తర్వాత ముత్తువేల్ పాండియన్ ఎక్కడికీ పారిపోలేదని, అతడిని పట్టుకోవడం ఎవరి వల్లా కావడం లేదనే డైలాగ్స్‌తో ట్రైలర్ మొదలవుతుంది. "అసలు ఎవడతను? అతడి వెనుక ఇంకెవరున్నారు?" అంటూ విలన్ గ్యాంగ్స్ భయపడే సీన్లు, నెల్సన్ మార్క్ డార్క్ హ్యూమర్ షాట్లు కొన్ని చోట్ల ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా.. "శత్రువులందరినీ ఒకే గూటికి పిలిచి.. ఒకేసారి బాంబుతో లేపేయడమే ఇప్పటి ట్రెండ్" అనే డైలాగ్ రజనీ మార్క్ స్వాగ్‌ను గుర్తుచేసింది. అనిరుధ్ రవిచందర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఎప్పటిలాగే కొన్ని ఫ్రేమ్‌లను నిలబెట్టే ప్రయత్నం చేసింది.ట్రైలర్ చూడటానికి బాగానే ఉన్నా.. సగటు సినీ ప్రియుడికి మాత్రం ఏదో తెలియని అసంతృప్తి మిగిలిపోతోంది. 'జైలర్' ఫస్ట్ పార్ట్ ఇచ్చిన అడ్రినలిన్ రష్, గూస్‌బంప్స్ మూమెంట్స్‌తో పోలిస్తే ఈ సీక్వెల్ ట్రైలర్ ఆ స్థాయి కిక్ ఇవ్వలేకపోయిందనే ఫీలింగ్ కలుగుతోంది. ఫస్ట్ పార్ట్‌లో శివరాజ్‌కుమార్, మోహన్‌లాల్ వంటి ఇతర ఇండస్ట్రీల దిగ్గజాల క్యామియోలు, ఇంటర్వెల్ బ్యాంగ్ ఇచ్చిన ఇంపాక్ట్ నెక్స్ట్ లెవెల్‌లో ఉండింది. కానీ 'జైలర్ 2' ట్రైలర్‌ను గమనిస్తే రొటీన్ రివేంజ్ డ్రామా, కాస్త డార్క్ కామెడీ మిక్స్ చేసి లాగించేసినట్లు కనిపిస్తోందే తప్ప.. ఫస్ట్ పార్ట్‌లో చూపించిన ఫ్రెష్‌నెస్ ఇందులో కనిపించలేదనే ఫీలింగ్ కలిగిస్తుంది. సూపర్ స్టార్ స్వాగ్ ఉన్నప్పటికీ.. కంటెంట్‌లో స్టార్ కాస్ట్ కనిపించిన మెరుపులేవీ అనిపించలేదు. మరి ఈ ట్రైలర్ కలిగించిన వెలితిని పక్కనపెట్టి, సినిమాలో నెల్సన్ ఇంకేమైనా సర్ ప్రైజ్‌లు దాచిపెట్టి బాక్సాఫీస్ వద్ద మేజిక్ చేస్తారేమో చూడాలి.

# జపాన్‌లో 'శివ' సునామీ..



అక్కినేని నాగార్జున, రామ్ గోపాల్ వర్మ కాంబినేషన్‌లో వచ్చి టాలీవుడ్ చరిత్రను, యాక్షన్ చిత్రాల రూపురేఖలను పూర్తిగా మార్చేసిన 'శివ' సినిమా ఎంతటి సంచలనం సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దశాబ్దాలు గడుస్తున్నా ఈ సినిమా క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. తాజాగా ఈ శివ జపాన్ గడ్డపై కూడా తన సత్తా చాటింది. అక్కడ 'శివ' సినిమాకు దక్కిన ఆదరణ చూస్తే ఎవరికైనా మైండ్ బ్లాంక్ అవ్వాల్సిందే. సాధారణంగా మన హీరోలకు మన దగ్గర ఎన్నో బిరుదులు ఉంటాయి. కానీ, జపాన్‌లోని నాగార్జున అభిమానులు మాత్రం ఆయనను పిలుస్తున్న పేరు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. జపాన్ ప్రేక్షకులు నాగార్జునను ప్రేమగా "లార్డ్ నాగ్", "నాగ్ సామా" అని పిలుచుకుంటూ ఆరాధిస్తున్నారు. ఒక ఇండియన్ హీరో సినిమాను అక్కడి ప్రజలు ఈ స్థాయిలో ఓన్ చేసుకుని, కొలవడం నిజంగా టాలీవుడ్ స్థాయికి నిదర్శనం.జపాన్‌లో ప్రత్యేకంగా ప్రదర్శించిన ఈ కల్ట్ చిత్రాన్ని చూసి అక్కడి ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. సినిమా చూసిన ఒక జపాన్ అభిమాని స్పందిస్తూ.. "ఈ హీరో స్క్రీన్ మీద ఎంత కూల్‌గా ఉన్నాడో! ఇది నిజంగా అత్యంత ఆసక్తికరమైన చిత్రం" అని కొనియాడారు. మరో అభిమాని అయితే "ఈ సినిమాను రెండోసారి, మూడోసారి, చివరికి నాలుగోసారైనా సరే ఎలాంటి బోర్ కొట్టకుండా చూస్తూనే ఉండగలను" అంటూ తన ప్రేమ వ్యక్తం చేశారు. 37 ఏళ్ల క్రితం వచ్చిన సినిమా అయినా, నేటికీ ఏమాత్రం పాతబడినట్లు అనిపించలేదని, ఇప్పటికీ సరికొత్త అనుభూతిని ఇస్తోందని వారు ప్రశంసల వర్షం కురిపించారు. అంతకుముందు, సినిమాను సరికొత్త హంగులతో రీ-మేక్ చేస్తూ.. 4ఖ డాల్బీ అట్మాస్ ప్రెజెంటేషన్‌లో నవంబర్ 14న థియేటర్లలోకి తీసుకువచ్చారు. దీనితో నాటి తరం జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూనే, కొత్త తరానికి కూడా ఆ అద్భుతమైన సౌండ్, విజువల్స్ సరికొత్త అనుభూతిని పంచాయి. అక్టోబర్ 5, 1989న విడుదలైన 'శివ' దేశవ్యాప్తంగా ఎలాంటి సంచలనం సృష్టించిందో, ఇప్పుడు సరిగ్గా అదే రేంజ్ వైబ్స్ జపాన్ ప్రేక్షకులను సైతం కట్టిపడేశాయి. ఏ దేశమైనా, ఏ భాషయినా.. మంచి కంటెంట్ ఉంటే సినిమాను ఆదరించడంలో సరిహద్దులు లేవని నాగార్జున మరోసారి నిరూపించారు!

# ఓటీటీ స్ట్రీమింగ్ కు రెడీ అవుతున్న 'ఎపిక్'..



'బేబి' వంటి ట్రెండ్ సెట్టింగ్ బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ మరియు వైష్ణవి చైతన్య కాంబినేషన్‌లో వచ్చిన లవ్ అండ్ ఎమోషనల్ డ్రామా 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్'. '90s' వెబ్ సిరీస్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆదిత్య హాసన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. యూత్, రొమాన్స్ మరియు ఎమోషన్స్ ప్రధానంగా రూపుదిద్దుకున్న ఈ చిత్రానికి సెన్సార్ బోర్డ్ 'A' సర్టిఫికేట్ జారీ చేసింది. ఇటీవలే థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా ఫ్లాప్ టాక్ తెచ్చుకుంది. ఇప్పుడు డిజిటల్ ప్రిమియర్ కోసం సిద్ధమైంది.ఈ చిత్రం అక్టోబర్ 9 నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ కానుంది. కేవలం తెలుగులోనే కాకుండా పాన్ ఇండియా స్థాయిలో తమిళం, కన్నడ, మలయాళం, మరియు హిందీ భాషల్లో కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. యువతను ఆకట్టుకునే కథాంశం కావడం, ఆనంద్-వైష్ణవి జోడీకి మంచి క్రేజ్ ఉండటంతో ఓటీటీ ప్రేక్షకులలో ఈ సినిమాకు ఎలాంటి రెస్పాన్స్ తెచుకుంటుందో చూడాలి. తెలంగాణ నేపథ్యంలో మొదలై యూకే బ్యాక్‌డ్రాప్‌లో సాగే డిఫరెంట్ లవ్ స్టోరీగా ఈ చిత్రాన్ని దర్శకుడు ఆదిత్య హాసన్ తెరకెక్కించారు. హెషమ్ అబ్దుల్ వహాబ్ అందించిన సంగీతం, లీడ్ పెయిర్ మధ్య కెమిస్ట్రీ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు, ఈ అక్టోబర్ 9 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో 'ఎపిక్' మూవీని వీక్షించవచ్చు.

# 'డ్యూ డేట్' అందరిని ఆలోచింపజేస్తుంది..



లోమేష్ పుడిపెద్ది హీరోగా, జయశ్రీ హీరోయిన్‌గా, ప్రణీత పట్నాయక్, విజ్ఞానిలు ముఖ్యపాత్రల్లో రూపొందుతున్న చిత్రం 'డ్యూ డేట్'. వరిష్ స్టూడియోస్ పతాకంపై పవన్ తరిగోపుల, ఏలూరు శ్రీను నిర్మిస్తున్న ఈ మూవీకి ఆనంద్.కె. దర్శకత్వం వహిస్తున్నాడు. ఇటీవల ఈ చిత్రం ఘనంగా పూజా కార్యక్రమాలతో స్టార్ట్ అయిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా మూవీ టీమ్ షూటింగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఈ రోజు హైదరాబాద్‌లో ప్రారంభమైంది. హీరో, హీరోయిన్ ఇతర ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ.. 'ప్రజెంట్ బర్నింగ్ ఇష్యూ ఆధారంగా అల్లుకున్న ఈ కమర్షియల్ కోర్ట్ రూమ్ డ్రామా ఆద్యంతం ఎంతో ఆసక్తికరంగా ఉత్కంఠభరితంగా ఉంటుంది. ప్రతి మనిషి, ప్రతి నెలా గుర్తుపెట్టుకునే డ్యూ డేట్ చుట్టు పూర్తి వాణిజ్య అంశాలతో అల్లుకున్న కథ ఇది. టైటిల్ దగ్గర నుంచి సినిమాలోని ప్రతి అంశం ప్రేక్షకులకు కొత్తదనంతో పాటు పూర్తి సంతృప్తిని కలిగించే కథ, కథనాలు ఈ చిత్రంలో ఉంటాయి. ఈ రోజు నుంచి 15 రోజుల పాటు ఏకధాటిగా జరిగే షెడ్యూల్‌తో తొలి షెడ్యూల్ పూర్తవుతుంది. తప్పకుండా ఈ చిత్రం అందర్ని ఆలోచింపజేస్తుంది. హృదయాలకు హత్తుకుంటుంది' అని చెప్పుకొచ్చారు.

# 'దాదా' ఈజ్ బ్యాక్..



నందమూరి నటసింహం నందమూరి బాలకృష్ణ , గోపీచంద్ మలినేని కాంబోలో వస్తున్న భారీ యాక్షన్ చిత్రం 'దాదా'. 'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత మాస్ కాంబోలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ట్రేడ్ వర్గాల్లోనూ, ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో బాలయ్యకు జోడిగా కాజల్ అగర్వాల్ నటిస్తుండగా, విలన్‌గా మంచు మనోజ్ సరికొత్త పవర్‌ఫుల్ పాత్రలో అలరించనున్నారు.అయితే గతనెలలో ఈసినిమా షూటింగ్ కాకినాడ పోర్ట్ పరిసరాల్లో జరుగుతున్నసమయంలో బాలకృష్ణ గాయపడడంతో మోకాలికి సర్జరీ నిర్వహించారు వైద్యులు. కొద్ది వారాల పాటు పూర్తి విశ్రాంతి తీసుకుని కోలుకున్న నటసింహం తిరిగి షూట్ లో పాల్గొనేందుకు రెడీ అయ్యారు. ఈ సినిమా మైసూర్ షెడ్యూల్ షూటింగ్ సెప్టెంబర్ 29 నుండి స్టార్ట్ చేసి ముందుగా ఇతర కీలక నటీనటులతో కొన్ని ముఖ్యమైన సన్నివేశాలను షూట్ చేసారు. ఇక అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న నటసింహం నందమూరి బాలకృష్ణ ఈరోజు నుంచి ఈ మైసూర్ షెడ్యూల్‌లో పాల్గొననున్నారు. ఈ షెడ్యూల్‌లో బాలయ్యపై కొన్ని భారీ యాక్షన్ సీన్లు, డ్రామా సన్నివేశాలను తెరకెక్కించేందుకు దర్శకుడు గోపీచంద్ మలినేని ప్లాన్ చేస్తున్నాడు. చిత్రీకరణను వీలైనంత త్వరగా పూర్తి చేసి, పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా వేగవంతం చేయాలని మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ క్రేజీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు ముహూర్తం ఖరారు చేశారు. నందమూరి తమన్ గా పేరు తెచ్చుకున్న తమన్ ఈ సినిమాను సంగీతం అందిస్తున్నారు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**